
ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

అదిగో.. ఇదిగో..!



- విశాఖ మెట్రోలో కానరాని పురోగతి
- టెండర్లకు స్పందన కరువు
- అక్టోబర్‌కు మరో గడువు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అదిగో...ఇదిగో అంటూ పాలకులు మురిపిస్తున్న విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు 'అరచేతిలో వైకుంఠం' మాదిరి తయారైంది. కాంట్రాక్టు సంస్థల నుంచి స్పందన కరువైంది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. విశాఖ మెట్రో రైలు అధికారులు పలు కన్సల్టెంట్లతో చర్చలు జరుపుతున్నా రూ.వేల కోట్ల పెట్టుబడి వ్యవహారాన్ని చూసి వారంతా వెనక్కి పోతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులే ధ్రువీకరిస్తున్నారు. ఈ నెల 12 శుక్రవారం మెట్రో రైలు టెండర్లకు ఆఖరు తేదీ. ఏ ఒక్కరూ ఆసక్తి చూపకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం గడువు మరలా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీని వయబిలిటీపై బిడ్డర్లకు పలు అనుమానాలు రేకె త్తడమే అంతటికీ కారణంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులను ఇచ్చే పరిస్థితిలో లేకపోవడం, రాష్ట్రంలోని టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దీనిపై సరైన రీతిలో నిధులు వెచ్చించే స్థితి కనిపించకపోవడంతో ఈ ప్రాజెక్టులో ఎటువంటి పురోగతీ కానరావడం లేదు. ఈ ఏడాది జులై 25న మెట్రోలకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. విజయవాడ మెట్రో డెడ్‌లైన్‌ను సెప్టెంబర్ 17 వరకూ ప్రభుత్వం పొడిగించింది. తాజా పరిస్థితుల్లో విశాఖ మెట్రోకు టెండర్ల గడువును అక్టోబర్ 7 నాటికి పొడిగిస్తూ నిర్ణయించారు. విశాఖ మెట్రో రైల్‌కు తొలి దశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6250 కోట్లు. మొత్తం మూడు కారిడార్‌లు పూర్తికావాలంటే రూ.11,498 కోట్లు అవసరం. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి సర్కారును కోరినప్పటికీ ఇంకా కేంద్రం ఆమోదించలేదు. దీంతో విశాఖ మెట్రో మళ్లీ మొదటికే వస్తుందా ? అన్న సందేహాలు అందరిలో కలుగుతున్నాయి.

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును 2026 జనవరికి పూర్తిచేసే దిశగా ప్రభుత్వం పనులను వేగవంతం చేస్తోంది. ఆ విమానాశ్రయం అనుకున్నట్టుగా పూర్తయి నిర్వహణలోకి వచ్చినా ఆ సమయానికి విశాఖ మెట్రో ప్రాజెక్టులో ఎటువంటి కదలికా ఉండకపోవొచ్చు. మేఘా ఇంజినీరింగ్ సంస్థను రాష్ట్ర ప్రభుత్వం విశాఖ మెట్రో కోసం రంగంలోకి దించే యోచన చేస్తున్నా మెట్రో రైల్ నిర్మాణంలో అనుభవం లేని ఈ సంస్థ కాంట్రాక్టు తీసుకుంటుందా ? తీసుకున్నాక మిగతా 2లో..



నక్కపల్లి మండలం రాజయ్యపేటలో నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

వార్తలు 8లో..

సమ్మెలోకి స్విగ్గీ, జొమాటో రైడర్లు

నేడు, రేపు సేవలు బంద్ ◆ సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖలోని స్విగ్గీ, జొమాటో రైడర్లు శని, ఆదివారం సమ్మెకు దిగుతున్నారు. ఈ రెండు రోజులూ సేవలు బంద్ అవుతున్నట్టు ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు బి.జగన్ తెలిపారు. సమ్మెను జయప్రదం చేయాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో ఏడు సంవత్సరాలుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారాలపై పనిచేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు పలు సమస్యలతో కునారిల్లుతున్నారన్నారు. వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రతా లేవన్నారు. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించే నాథుడే మిగతా 2లో..

నేడు జాతీయ లోక్ అదాలత్

▶ వార్త 2లో..

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

▶ వార్త 2లో..

అందుబాటులోకి విఎంఆర్‌డిఎ జోనల్ కార్యాలయాలు

▶ వార్త 2లో..

హెచ్‌ఎస్‌ఎల్‌కు షిప్‌బిల్డింగ్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆనంద్ మోహన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) షిప్‌బిల్డింగ్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. గురువారం ముంబయిలో జరిగిన మారిటైమ్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవంలో ఈ అవార్డును. హెచ్‌ఎస్‌ఎల్ తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్) సికె.ఆనంద్ మోహన్ అందుకున్నారు. సముద్ర రంగంలో అత్యుత్తమ ఆవిష్కరణలు, కార్యాచరణల పట్ల హెచ్‌ఎస్‌ఎల్ అచెంచలమైన నిబద్ధతకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

నౌకానిర్మాణ ప్రాజెక్టులలో భారత నావికాదళం కోసం మొదటి డిపి-2 డైవింగ్ సపోర్ట్ వెసెల్‌ను నిర్మించడంలో సంస్థ వినూత్న విధానాన్ని గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. హెచ్‌ఎస్‌ఎల్ మొదటి స్వదేశీ డైవింగ్ సపోర్ట్ వెసెల్‌ను ఈ ఏడాది జూలై 8న నావికాదళానికి అందజేసిన విషయం తెలిసిందే.

22, 23న ఈ-గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ-గవర్నెన్స్ విధానాల అమలు ప్రక్రియ, సిబ్బంది నియామకం, సంక్షేమం, శిక్షణ, కెరీర్ అభివృద్ధి, ప్రజా ఫిర్యాదులు, ప్రజా ఆధారిత ఆధునిక పరిపాలన విధానాలు తదితర అంశాలపై విశాఖలో ఈ నెల 22, 23వ తేదీల్లో 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు జరగనుంది. దీనికి సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల కేంద్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ-గవర్నెన్స్ డివిజన్ నేతృత్వం వహిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోంది. వికసిత్ భారత్, సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ పేరిట రెండు రోజుల పాటు స్థానిక నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే ఈ సదస్సులో ఆరు ప్లీనరీ, ఆరు బ్రేక్ అవుట్ సెషన్లు జరగనున్నట్లు సమాచారం. దేశం నలుమూలల నుంచి వెయ్యి మంది వరకు అతిథులు, ఐటి రంగ నిపుణులు, ఏపి సిఎం చంద్రబాబుతోపాటు కేంద్ర, రాష్ట్రాల ఐటి శాఖ మంత్రులు భాగస్వామ్యం కానున్నారు. ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు ముందుగానే చేయాలని సంబంధిత అధికారులను, నిర్వాహకులను ఆదేశిస్తూ జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 17వ వైశాఖి నృత్యోత్సవం - 2025 శుక్రవారం విశాఖపట్నంలోని కళాభారతి వేదికపై ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతీయ నృత్యోత్సవం ఐసిసిఆర్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జరుగుతోంది. తొలిరోజు ప్రత్యేక అతిథులుగా విశ్రాంత ఐఆర్‌ఎస్ సుదగాని రవిశంకర్ నారాయణ్, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, జివిఎంసి కార్పొరేటర్ పి.ఉషశ్రీ , జిఎస్‌టి అడిషనల్ డైరక్టర్ ఎన్.మహమ్మద్ అలీ, ఐఆర్‌ఎస్, కళాభారతి కార్యదర్శి జివిఆర్‌కె. ప్రసాద్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.



ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

అనంతరం తొలిరోజు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అదిగో.. ఇదిగో..!

వేరే కన్సల్టెంట్లు లేదా పార్టనర్లను చేర్చుకుని పని చేపడుతుందా ? ఇవన్నీ ఆచరణ సాధ్యమేనా ? అన్నది వేచిచూడాల్సిందే. పైగా మెట్రోలకు నిధులు కేంద్రం ఇవ్వకపోగా, డిపిఆర్‌కు సైతం ఇంతవరకూ ఆమోదం తెలపకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం ప్రారంభం

కార్యక్రమంలో భాగంగా కేరళ కూచిపూడి కళాకారిణి డాక్టర్ పద్మిని కృష్ణన్‌చే మరకత మణిమయ చేల, ఉత్తుకాడు వెంకట కవి కృతిని ప్రదర్శించి అందరినీ మైమరిపింపజేశారు. ఒడిస్సీకి చెందిన విదుష్మి కవిత ద్వివేది బృందంచే విష్ణు అవతారాలు ప్రదర్శించారు. తెలంగాణకు చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ గ్రహీత ఒగ్గు రవి కుమార్ బృందం ఒగ్గు డోలు విన్యాసం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మల్లన్న, బీరప్ప కథలతో పాటు ఉత్సాహభరితమైన విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులకు అతిథులు పురస్కారాలను అందజేశారు. పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డును కేరళ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు అందజేశారు.

సమ్మెలోకి స్విగ్గీ, జొమాటో రైడర్లు

కరువయ్యాడని తెలిపారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న జీవన ఖర్చులు, పెట్రోల్ ధరలు, అనిశ్చితమైన ఆదాయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడిలను వెంటనే పునరుద్ధరించాలని, మినిమం గ్యారెంటీ సాలరీ, ఇన్‌కం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలన్నారు. ఒకే రకమైన ఇన్సెంటివ్ విధానం ఉండాలని, ఫేక్ నోటిఫికేషన్లను తొలగించాలని కోరారు. క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాలన్నారు. బేస్ ఫెయిర్ కనీసం రూ.30కి పెంచాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సిఐటియు మద్దతు

స్విగ్గీ, జొమాటో రైడర్ల సమ్మెకు సిఐటియు మద్దతు తెలుపుతున్నట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాభాలు గడిస్తున్న సంస్థలు రైడర్ల సమస్యలను పరిష్కరించ కపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జోక్యం చేసుకుని రైడర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

సంక్షేమంపై చర్చకు సిద్ధమా ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమంపై వైసిపి అధినేత జగన్ చర్చకు సిద్ధమా ? అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాలు విసిరారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదంటూ జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. ఎంవిపి.కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో గంటా మాట్లాడుతూ రుషికొండలో రూ.500 కోట్లతో విలాసవంతమైన ప్యాలెస్‌ను, అన్ని జిల్లాల్లో ప్యాలెస్ నమూనా పార్టీ కార్యాలయాలను ఆగమేఘాల మీద నిర్మించిన జగన్మోహన్ రెడ్డి ప్రజోపయోగమైన మెడికల్ కాలేజీ నిర్మాణాలను మాత్రం మర్చిపోయారని విమర్శించారు. అయిదేళ్లలో ఆయన కేవలం అయిదు మెడికల్ కాలేజీలను మాత్రమే అప్ గ్రేడ్ చేశారని, మిగిలిన వాటిలో 20 శాతం పనులు కూడా చేయలేదని విమర్శించారు. ప్రైవేటీకరణకు, పిపిపికి తేడా తెలీకపోవడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్ష నాయకుని హోదాకు తగదనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. కూటమి కంటే మెరుగైన సంక్షేమం అందించినట్టు ఆయన నిరూపిస్తే రాజకీయాల నుంచి తాను శాశ్వతంగా తప్పుకుంటానని గంటా అన్నారు.

విఒఎల పోరాటానికి ఐద్వా మద్దతు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు చెల్లించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న విఒఎలు పీడీ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాకు ఐద్వా మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎన్.మాధవి, వై.సత్యవతి ఒక ప్రకటన విడుదల చేశారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, సొంత గనులు కేటాయించాలని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1628వ రోజుకు చేరాయి. దీక్షల్లో కంచరపాలెం జోన్ సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు ఇవ్వాలని పార్లమెంటులో అడగాల్సిన విశాఖ ఎంపీ శ్రీ భరత్ దానిని పట్టించుకోకుండా అనకాపల్లి జిల్లాలో ప్రైవేటు రంగంలో వస్తున్న ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు ఇవ్వాలని కోరడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో సంఘం జోన్ అధ్యక్షులు ఎస్.శ్రావణ్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, ఎన్.ప్రకాశరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో విఫలం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఈ తరుణంలో ఈ నెల 17వ తేదీన విజయవాడలో నిరుద్యోగ ఆవేదన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగువ అచ్యుతరావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. కెజిహెచ్ అభివృద్ధిపై అన్ని విభాగాల అధిపతులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా అవసరమైన వైద్యపరికరాలు, వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆంకాలజీ విభాగానికి 30 మంది స్టాఫ్‌నర్సులు కావాలని ఆయా విభాగ వైద్యులు తెలిపారు. గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య పరికరాలపై కలెక్టర్‌కి ప్రతిపాదించారు. ఎండోక్రైనాలజీ విభాగంలోని లీకేజీలు, మరమ్మత్తులు చేపట్టాలని వైద్యులు కోరారు. విభాగ అధిపతుల మధ్య సమన్వయంపై డిఎంఈతో మాట్లాడి అక్కడ నుంచే వచ్చే ఉత్తర్వులు మేరకు పని సర్దుబాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కెజిహెచ్ అభివృద్ధికి సంబంధించి వార్డుల వారీగా పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ రమణకు కలెక్టర్ ఆదేశించారు. రెండు గంటల పాటు సమావేశం నిర్వహించడం విశేషం.



కెజిహెచ్ హెచ్ఓడిలతో సమావేశమైన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై ఆరా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు సిద్ధం కావాలని, ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు మొదలు పెట్టి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కల్పించాలని, నాణ్యమైన అన్నప్రసాదం అందించాలని సూచించారు. శుక్రవారం ఆకస్మికంగా ఆలయాన్ని తనిఖీచేసి అక్కడ పరిస్థితులను గమనించారు. ధర్మదర్శనం క్యూలైన్లతో పాటు ఇతర క్యూలైన్లను, భక్తుల తాకిడికి అనుగుణంగా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదం భోజనశాలను సందర్శించి అక్కడ వినియోగించే సరకులను చూశారు. రికార్డులు తనిఖీ చేశారు.

రాబోయే మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారులు అనుసరించబోయే విధానాలపై ఆరా తీశారు. గత పొరపాట్లు పునరావృతం కాకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇఇ వెంకట రమణ, ఎఇఒలు, ఇతర అధికారులు ఉన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సిఎస్) విశాఖపట్నం బ్రాంచ్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అధ్యక్షునిగా ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ (జిల్లా కలెక్టర్), ఛైర్మన్‌గా సి.బాలసతీష్, వైస్‌ఛైర్మన్‌గా మురళీకృష్ణ పట్నాయక్, కోశాధికారిగా జి.విప్రసాదరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా రహమతుల్లా, డాక్టర్ సిహెచ్.స్వామినాయుడు, ప్రొఫెసర్ నరవ ప్రకాశరావు, జ్యోతి స్వరూప్‌నాయర్, ప్రొఫెసర్ హరనాథరావు, ముషాత్రి ఆల్తాఫ్, శుభోమయ బెనర్జీ, డాక్టర్ జి.వాసిలివ ఎన్నికయ్యారు.

అందుబాటులోకి విఎంఆర్‌డిఎ జోనల్ కార్యాలయాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విఎంఆర్డిఎ పరిపాలన సౌలభ్యం కోసం అనకాపల్లి, విజయనగరంలో నూతనంగా నిర్మించిన విఎంఆర్డిఎ జోనల్ కార్యాలయాలను వర్చువల్ విధానంలో విఎంఆర్డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, శుక్రవారం విఎంఆర్డిఎ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి, విజయనగరం ప్రాంత ప్రజలకు పరిపాలనపరంగా మరింత చేరువ కావటానికి వీలుగా విఎంఆర్డిఎ నూతనంగా జోనల్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. విజయనగరం లో రూ.47.95 లక్షలు, అనకాపల్లిలో రూ.33.5లక్షలతో ఖర్చుతో పున్హ నిర్మించిన కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ జోనల్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని, ఆయా ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎంఆర్డిఎ విభాగాధిపతులు మురళీకృష్ణ వినయ్‌కుమార్, హరిప్రసాద్, సుజాత శివాని, భవానీ శంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: అభివృద్ధి పేరుతో విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఇది సరికాదని గత ప్రభుత్వం నిర్మించిన 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు డిమాండ్ చేశారు. అల్లిపురం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా అడుగులు వేస్తోందని దానికి నిదర్శనం 10 వైద్యకళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేస్తోందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే వైద్య కళాశాలలో 100 శాతం కన్వీనర్ కోటాలో అడ్మిషన్స్ చేస్తామని చెప్పి ఇప్పుడు 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఖండించారు.

జివిఎంసి ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌లో 23 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశం మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 23 వినతులు స్వీకరించడం జరిగినదని , అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 1, 2వ జోన్‌కు 2, 3వ జోన్‌కు 3, 4వ జోన్‌కు 2, 5వ జోన్‌కు 5, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 9 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను / ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ఘనంగా సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వి.జయప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో స్థాపించిన ఈ సంస్థ ఇప్పటి వరకూ 1.51 లక్షల మందికి పైగా శిక్షణ అందించిందని వీరిలో కాలేజీ విద్యార్థులు, ఉద్యోగ వృత్తిపరులు ఉన్నారన్నారు. ఈ శిక్షణలో ఆచరణాత్మక స్పెషల్ ద్వారా ఆసక్తికరంగా నిర్వహించబడ్డాయని ఆయన అన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టిరాజు మీడియాకు తెలిపారు. పెండింగ్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాద నష్టపరిహారాలు, రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మహిళల భద్రతకు 'మిషన్ శక్తి'

ప్రజాశక్తి- సీతమ్మధార : మహిళల భద్రత, సాధికారత పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని ఐసిడిఎస్ అర్బన్ సిడిపిఒ కె.నీలిమ అన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద నున్న రాక్‌డెల్ స్కూల్ విద్యార్థినులకు మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని ఈ నెల 2 నుంచి 12 వరకు జిల్లాలో నిర్వహించామన్నారు.. మహిళల భద్రతకు చేసిన చట్టాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భేటీ భచావో, భేటీ పడావో, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు-కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యులు అనూష, సెక్టార్ సూపర్‌వైజర్ జెటిఎస్ జ్యోతి పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మాజీ కేంద్ర మంత్రి

ప్రజాశక్తి- వేపగుంట : ఒడిశాకు చెందిన మాజీ కేంద్రమంత్రి, మేఫెయిర్ హోటల్స్, రిసార్ట్స్ లిమిటెడ్ చైర్మన్ దిలీప్ రే దంపతులు శుక్రవారం సింహాద్రి అప్పన్న దర్శించుకున్నారు.వారికి ఆలయ పర్యవేక్షణ అధికారి సునీల్‌కుమార్, పిఆర్‌ఒ నాయుడు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అంద జేయగా, ఆలయ పర్యవేక్షణ అధికారి బరువు శ్రీనివాస్ స్వామి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదం అందజేశారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 93వ వార్డు కృష్ణానగర్‌లో శుక్రవారం జోనల్ కమిషనర్ హెచ్.శంకర్ పర్యటించారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఎస్ఎస్ రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

వార్డు అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డులో సమస్యల పరిష్కారానికి , అభివృద్ధికి సహకరించాలని ఆ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఎనిమిదో జోన్ కమిషనర్ శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు.

మేలు జాతి దూడలతో ఆదాయం

ప్రజాశక్తి-భీమునిపట్నం : మేలు జాతి దూడలను పుట్టించడం ద్వారా పాలదిగుబడి, అధికాదాయం సాధించవచ్చని డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పుడు అన్నారు. శుక్రవారం జిల్లా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పెయ్యి దూడల ఉత్పత్తి పథకం గోడపత్రికను వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90శాతం కచ్చితత్వంతో మేలుజాతి పెయ్యి దూడలు పుట్టించవచ్చని, పాడిరైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రశేఖర్,భీమిలి డివిజన్ వెటర్నరీ ఎడి సునీల్ కుమార్, ప్రసాద్, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కొండవాలు ప్రాంతంలో పర్యటిస్తున్న పార్వతి

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు కొండవాలు ప్రాంతంలో జనసేన వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలువలు, రోడ్లు, ఇతర సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందిస్తూ, ఆయా సమస్యలపై అంచనా ప్రతిపాదనలు రూపొందించి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి నిధులుమంజూరుకు కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. జనసేన నేత టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని బొడ్డపాలెం హౌసింగ్ లేఔట్‌ను మండల ప్రత్యేక అధికారి కె రామారావు శుక్రవారం సందర్శించి, ఇళ్లు నిర్మించని లబ్ధిదారుల వివరాలు సేకరించారు. నిర్మాణం చేపట్టకపోవడానికి కారణాలను తెలుసుకుని, తక్షణమే పనులు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఆదేశించారు. బొడ్డపాలెం అంగన్వాడీ సెంటర్ పనితీరును పరిశీలించి, మెరుగుదలపై సూచనలు చేశారు. యుపి స్కూల్‌ను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన మెనూ, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు బోధిస్తున్న సిలబస్ వివరాలు తెలుసుకున్నారు. వెల్లంకి సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరును సమీక్షించి, సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.సత్యనారాయణ, హౌసింగ్ ఎఇఇ శ్యాం సుందర్, ఎంఇఒ కె.గంగరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



వెల్లంకి సచివాలయ తనిఖీలో మండల ప్రత్యేకాధికారి

'గీతం' ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం పి.ఎం.పాలెంలోని విశాఖ బ్లైండ్ స్కూల్‌లో ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ కె.వనిత, కె.యశోధ ఆధ్వర్యంలో అంధుల పాఠశాల బాలలకు వివిధ పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహనతో పాటు డిజిటల్ టెక్నాలజిల గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణ, పోషకాహార ప్రాధాన్యత వంటి అంశాలపై సహితం పాఠశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన కల్పించారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను పాఠశాల హెచ్‌ఎం బి.సుధారాణి, అభినందించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి ఎనిమిదో జోన్ పరిధిలో వాహనాల్లో చెత్త తరలింపులో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పలు ప్రాంతాల నుంచి వేపగుంటలోని డంపింగ్‌యార్డుకు చెత్తను తరలించే క్రమంలో చెత్తతో నింపిన వాహనాలపై ఎటువంటి టార్పాలిన్లుగానీ, నెట్‌గానీ కప్పకుండా అలాగే ప్రధాన రహదారుల్లోంచి తరలించే క్రమంలో వెనుకన వస్తున్న వాహనదారులపై చెత్త పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బైకిస్ట్‌ల కళ్లలో చెత్తపడడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి మార్పులేదని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తపై ఎటువంటి కప్పడం లేకుండా తరలింపు

డైట్‌లో ముగిసిన కళా ఉత్సవ్



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో గురువారం ప్రారంభమైన కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 25 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు నాటిక, చిత్రలేఖనం, శిల్ప కళ, సాంప్రదాయ కథల పోటీల్లో పాల్గొన్నారు పెద బొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం, జి రవి, రాజాం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శారద పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు

13 నుంచి 'అవంతి'లో ఎఫ్‌డిపి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 13 నుంచి 18 వరకు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) నిర్వహించనున్నట్లు అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సంబంధిత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆన్ హైడ్రోజన్ ఎనర్జీ సిస్టమ్స్ ఫర్ ఎ క్లీన్ అండ్ గ్రీన్ ఫ్యూచర్' పైన, నైపుణ్యత పరిశోధన తదితర అంశాలపై ప్రోగ్రాం జరుగుతుందన్నారు.ప్రిన్సిపల్ బి మురళీకృష్ణ, పరీఫ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

లిక్విడ్ గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- పెందుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరిపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ దేవుడు నాయుడు సిబ్బందితో వాహన తనిఖీలలో భాగంగా ఏజెన్సీ ప్రాంతం నుండి వచ్చే వాహనాలను పరిశీలించగా, కొత్తవలస వైపు నుండి రెండు బైక్‌లపై వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.50వేలు విలువైన రెండుకిలోల లిక్విడ్ గంజాయి పట్టుబడింది. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండడాన్ని గమనించిన అనంతగిరి మండలం, దొన్నలవలస గ్రామానికి చెందిన సమారిడి అర్జున్, బాల్లి మామిడి గ్రామానికి చెందిన దుంబరి స్వామి, డుంబ్రిగుడ మండలం సీలంగొండి గ్రామానికి చెందిన డుంబరి జోయో పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా హ్యాష్ ఆయిల్ పట్టుబడింది. లిక్విడ్ గంజాయితోపాటు రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరకు నుండి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు తరలిస్తుండగా పట్టుబడినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

నేరాలు ఘోరాలు

వికలాంగ బాలికపై లైంగిక దాడి కేసు

నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : వికలాంగ చిన్నారిపై పైశాచికంగా లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.పదివేల జరిమానా చెల్లించాలని అందులో బాలికకు రూ.8 వేల ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. చిన్నారికి ప్రభుత్వం రూ. 4లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలివి.

భీమిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెవి అగ్రహారానికి చెందిన నిందితుడు బోర ఎల్లారెడ్డి (50), అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని, మంచం మీద నుంచి కదలలేని వికలాంగ బాలికపై ఈఏడాది జనవరి 21న కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారిని మంచంపై ఉంచి పనిమీద ఆమె తాతమ్మ బయటకు వెళ్ళిన సమయంలో నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

విషయం తెలుసుకున్న బాలిక తల్లి అక్కరబోయిన హేమలత, తండ్రి రమణ ఇంటి సమీపంలో ఉన్న పైడమ్మ కొల్లి వెంకటి తదితరులు ఎల్లారెడ్డి ఇంటికి వెళ్లి ప్రశ్నించగా మద్యం మత్తులో వారితో దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై బాధిత బాలిక తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భీమిలి పోలీసులు, నార్త్ ఎసిపి ఎస్ అప్పలరాజు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేసి, కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేసిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఈ మేరకు తీర్పునిచ్చారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : హత్యాయత్నం ఆరోపణలు రుజువు కావడంతో నిందితునికి ఐదేళ్ల కఠినకారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గాజువాకలోని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరవ శ్రీనివాస చంద్రశేఖర్ అందించిన కేసు వివరాలివి.

గాజువాక డ్రైవర్స్ కాలనీకి చెందిన పొట్నూరు మనోజ్ కుమార్ సేఫ్టీ మేనేజర్‌గా స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు 2019 జూలై 30న రాత్రి పదిన్నర గంటలకు గాజువాక జగ్గు జంక్షన్ వద్ద రేష్మ బార్ అండ్ రెస్టారెంట్‌కు మద్యం తాగేందుకు వెళ్లాడు. అక్కడ రౌడీషీటర్ ధనాల మోహన్ అలియాస్ బిల్లా కేత మణికంఠ అనే వ్యక్తికి బీరు తాగేందుకు డబ్బులు ఇవ్వమని బెదిరించగా గొడవ రేగింది. దాన్ని సద్దుమణిగించేందుకు యత్నించిన మనోజ్‌ను నిందితుడు మోహన్ తన వద్దనున్న బటన్ కత్తితో పొడిచాడు. బాధితుడు మనోజ్ ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఛార్జిషీట్‌ను దాఖలు చేయగా, విచారించిన న్యాయమూర్తి, నేరాభియోగం రుజువు కావడంతో ఈ మేరకు తీర్పు చెప్పారు.

చోరీ కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వేంపాడు గ్రామంలో చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబులతో విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 8న వేంపాడు గ్రామానికి చెందిన కొత్త నాగేశ్వరరావు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టగా, పక్కగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ సన్నిబాబు సిబ్బందితో వేంపాడు జంక్షన్ వద్ద డిఎల్ పురం గ్రామానికి చెందిన నిందితుడు గింజాల అప్పారావును పట్టుకున్నారు. నిందితుడి నుంచి , 53.73 గ్రాములు బంగారం, రూ.72 వేల నగదును స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేశారు.

పరారీలో ఉన్న నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. 2023లో నమోదైన కేసుకు సంబంధించి మురభోయిన వెంకట దినేష్ సాత్విక్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడన్నారు.కృష్ణదేవిపేట గ్రామ శివారులో నిందితుడిని అరెస్టు చేసి నర్సీపట్నం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్

ప్రజాశక్తి-భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడ్పీ హైస్కూల్ ను ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ శుక్రవారం సందర్శించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపానం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన స్కౌట్ మాస్టర్ టిఎస్‌వి ప్రసాదరావును అభినందించారు.

అంతకుముందు తాటితూరు గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, రేషన్ డిపోను , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆర్‌డిఒ సందర్శించారు.సచివాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎంపిడిఒ కెవి.నరసింహారావు, డిప్యూటీ ఎంపిడిఒ కె.రమేష్‌నాయుడు, హెచ్ఎం డి.శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ బి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతం ఎమ్మెస్సీ విద్యార్థులకు 'మైక్రాన్'లో ఉద్యోగాలు



మైక్రాన్‌లో ఉద్యోగాలు సాధించిన గీతం ఎమ్మెస్సీ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో ఎమ్మెస్సీ విద్యార్థులకు ప్రముఖ ఐటి సంస్థ మైక్రాన్ భారీ వేతనంలో ఎంపిక చేసుకుంది. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలోనేప్రాంగణ నియామకంలో ఎమ్మెస్సీ ఫైనలియర్ విద్యార్థులు ఎస్.లహరి మోహన్, ఎమ్.వర్షిణి, పి.భవాని, కె.హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్.మనోజ్ రూ.12.26 లక్షల వార్షిక వేతనంతో మైక్రాన్ సంస్థకు ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరు, కన్నవారి తోట నివాసి, అడిషనల్ ఎస్‌పి. తీగల రవీంద్రబాబు, నాగేశ్వరమ్మ దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అడివి వరం గ్రామానికి చెందిన కసిరెడ్డి సురేంద్ర ద్వారా దేవస్థానానికి అందజేశారు. విరాళదాతలకు బాండ్‌ను దేవస్థానం ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి పూసపాటి సునీల్‌కుమార్ అందజేశారు.

వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా జగదీశ్వరరావు



బెవర జగదీశ్వరరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా 13వ వార్డుకు చెందిన బెవర జగదీశ్వరరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ పదవి రావడానికి సహకరించిన రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, సోషల్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ అంజి రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జగదీశ్వరరావు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతి



సిఎండికి వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యుత్ సంస్థల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి నేతలు కోరారు. శుక్రవారం ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ .1999 ఫిబ్రవరి ఒకటి నుంచి 2004 మధ్య జాయినైన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.బేషరతుగా కారుణ్య నియామకాలను చేపట్టాలని,, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి నెలవారీ వేతనాలను నేరుగావారికే చెల్లించాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, పెండింగ్‌డిఎలను మంజూరు చేయాలని కోరారు.

ఉద్యోగుల వినతిపై సిఎండి స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో డిస్కం జెఎసి నాయకులు విఎస్ఆర్‌కె. గణపతి, భూక్య నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ, జోగి నాయుడు, కేతా భాస్కర్, ఎస్ గోవింద్ పాల్గొన్నారు.

ప్యాంక్రియాటైటిస్ కేన్సర్‌కు రోబోటిక్ సర్జరీ

రాష్ట్రంలో తొలిసారి విజయవంతంగా నిర్వహించిన కేర్ వైద్యులు



విలేకర్లతో మాట్లాడుతున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : క్లిష్టమైన కేన్సర్ శస్త్ర చికిత్సల్లో ఒకటైన అతి ప్రాణాంతకమైన ప్యాంక్రియాటైటిస్ ఆపరేషన్‌ను పూర్తి రోబోటిక్ సాయంతో రాష్ట్రంలో తొలిసారిగా ఇద్దరు రోగులకు ఆరిలోవ కేర్ ఆసుపత్రి విజయవంతంగా నిర్వహించి రికార్డు సృష్టించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ అండ్ రోబోటిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ బిశ్వబసుదాస్ ఆధ్వర్యంలో డాక్టర్ విన్ని రొబోటిక్ సర్జికల్ సిస్టమ్ సహాయంతో రోగులు జి.శేషగిరిరావు, కె.శుభమణి ప్యాంక్రియాటిస్ ప్రాంతంలో కేన్సర్ కణుతులు తొలగించి ఐదు రోజుల్లో డిశ్చార్జ్ చేసామని వైద్యబృందం తెలిపింది.

శుక్రవారం మీడియా సమావేశంలో ఆరిలోవ హెల్త్‌సిటీ కేర్ ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ దాస్ మాట్లాడుతూ ప్యాంక్రియాటైటిస్‌తో రోగులు కామెర్లు, తీవ్రమైన కడుపునొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలతో కేర్ ఆసుపత్రిని సంప్రదించినట్లు తెలిపారు. సాధారణ శస్త్ర చికిత్స అయితే 10 నుంచి 12 అంగుళాల కోత, ఎక్కువ రక్త స్రావం వల్ల ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండటమే కాకుండా నివారణ శాతం కూడా తక్కువ ఉంటుందన్నారు. అయితే రోబోటిక్ సర్జరీతో చిన్నపాటి కోతతో సమర్ధంగా సర్జరీ జరిపామన్నారు. సర్జరీ జరిగిన 24 గంటల్లోనే రోగులు నడవగలిగారన్నారు. కేర్ ఆసుపత్రి సిఒఒ మమూర్ చౌక్ మాట్లాడుతూ ప్రపంచస్థాయి కేన్సర్ వైద్యం అందించడమే లక్ష్యంగా అత్యాధునిక పరికరాలు, చికిత్స ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు.

ఆపరేషన్ అనంతరం కోలుకున్న రోగి శేషగిరిరావు మాట్లాడుతూ ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెప్పగానే భయపడ్డానని, అయితే పెద్ద గాయం లేకుండా చేసిన ఆపరేషన్‌తో రెండోరోజే నడవగలిగానని,ఇపుడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని వెల్లడించారు. మరుసటి రోజే నడవగలిగానని అన్నారు. ఇపుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్టు తెలిపారు. డాక్టర్ దాస్, ఇతర కేర్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లోరెన్స్ సదస్సులో మెరిసిన భువన



ప్రశంసాపత్రం అందుకుంటున్న భువన కల్యాణి

ప్రజాశక్తి- వేపగుంట : ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఈనెల 8 నుండి 12 వరకు 'లో విజన్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్'పై జరిగిన 15వ అంతర్జాతీయ సమావేశంలో శంకర్ ఫౌండేషన్, సమర్థ కాలేజ్ ఆఫ్ ఆప్టోమెట్రిక్ అకడమిక్ ఇన్‌ఛార్జి భువన కళ్యాణి మెరిసింది. భారత్ తరఫున ఈ సదస్సులో పాల్గొన్న ఏకైక ప్రతినిధిగా అరుదైన అవకాశం దక్కించుకుని,ఆప్టోమెట్రీ, దృష్టి పునరావాస రంగంలో ప్రపంచం లోని ప్రముఖ నిపుణులలో ఒకరిగా నిలిచారు. ఈ సదస్సులో ఆకర్షణీయమైన ప్రజెంటేషన్‌తో అంతర్జాతీయ ప్రతినిధుల నుండి అద్భుతమైన ప్రశంసలు అందుకున్నారు.

చెన్నైలోని రామచంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌అండ్ రీసెర్చ్ నుండి ఎంఎస్‌సి ఆప్టోమెట్రీలో బంగారు పతక విజేత అయిన భువన కల్యాణి, కంటి సంరక్షణ నిర్వహణలో వినూత్న విధానాలను నొక్కి చెబుతూ, తక్కువ దృష్టి సంరక్షణ, పునరావాస వ్యూహాలపై అంతర దృష్టులను ప్రదర్శించారు.

అంతర్జాతీయ వేదికపై ప్రసంగించి, శంకర్ ఫౌండేషన్ ఖ్యాతిని పెంచిన భువన కల్యాణిని మేనేజింగ్ ట్రస్టీ ఎ. కృష్ణ కుమార్, జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్, ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, అభినందించి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

తెలుగు వారి సంక్షేమమే లక్ష్యం: గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం :అధికారంలో ఉన్నా, లేకున్నా తెలుగువారు సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తోందని, ప్రపంచంలో ఎక్కడున్నా, ఎటువంటి ఆపదలో ఉన్నా వారిని రక్షించేందుకు పాటుపడుతుందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. శుక్రవారం గోపాలపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో గల్ఫ్‌లోనూ, ఉత్తరాఖండ్ వరదల్లోనూ తెలుగువారు చిక్కుకున్న సమయంలో తమ పార్టీ అధికారంలో లేనప్పటికీ, విపక్షంలో ఉంటూనే వారికి అండగా నిలిచామన్నారు. చంద్రబాబునాయుడు సారధ్యంలో వారిని తమ స్వస్థలాలకు సురక్షితంగా చేర్పించేందుకు కృషి చేశామ న్నారు. ఇపుడు నేపాల్‌లో తెలుగువారు చిక్కుకున్నారన్న సమాచారం తెలియగానే24 గంటల్లో వారిని స్వస్థలాలకు క్షేమంగా రప్పించేందుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు వైసిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో ఇరవై ఏళ్ళు వెనక్కుపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇపుడు కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు.

30లోగా 'ఎన్ఎంఎంఎస్' దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు నమోదు సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఏపి ఆదర్శపాఠశాలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ3.50లక్షల లోపున్న విద్యార్థులంతా ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేటకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్ష రాసే సమయానికి అన్ని సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఒబిసి, ఒసి విద్యార్థులకు రూ 100లు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ 50లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులో ఇవ్వబడిన ఎస్‌బిఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్ లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 15లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 - 26 విద్యాసంవత్సరానికి పిజి కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి సురేఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఎపిపిజిసెట్ 2025 లో అర్హత సాధించిన వారు ఈ నెల 15లోగా కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు పూర్తి వివరాలకు 8179780917 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు

498 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర వారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 498 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఎన్‌సిసి, ఎం ఎస్ఎస్ విద్యార్థులు సహకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ దివ్య వర్షిణి, ఎం రాము పర్యవేక్షణలో రక్త దాన శిబిరంలో రఘు విద్యా సంస్థల చైర్మన్ కె రఘు, కరస్పాండెంట్ రమాదేవి, ప్రిన్సిపాల్స్ విజయ్ కుమార్, జగదీష్ పండా, డీన్ సతీష్ చౌదరి, ఎన్‌సిసి అధికారి కృష్ణకిషోర్, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని సందర్శన



సంపద తయారీని పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఉషారాణి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఎల్.వి.పాలెం సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి ఉషారాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంపద కేంద్రంలోని షెడ్‌ను పరిశీలించి లోటుపాట్లను గుర్తించారు. వాటిని సవరించి, సమర్థవంతంగా కొనసాగించాలని గ్రామ కార్యదర్శి అనురాధను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి అంశం సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జాతీయ రహదారి విస్తరణతో ఉపాధి, వాణిజ్య అవకాశాలు

అనకాపల్లి-అన్నవరం-దివాన్‌చెరువు ఎన్‌హెచ్-16 విస్తరణపై సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న ఎంపీ రమేష్, చిత్రంలో కలెక్టర్, జెసి, ఎమ్మెల్యేలు, అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి


అనకాపల్లి జిల్లాలో జాతీయ రహదారి విస్తరణతో రవాణా, పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య రంగాల్లో విశేష వృద్ధి జరుగుతుందని, ఉపాధికి కొత్త అవకాశాలు వస్తాయని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అనకాపల్లి-అన్నవరం-దివాన్ చెరువు ఎన్‌హెచ్ -16 రహదారి విస్తరణ డిపిఆర్‌పై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు అనకాపల్లి జిల్లాలో సుమారు 68 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు ఈ ప్రతిపాదిత రహదారి అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల మీదుగా జరుగుతుందని చెప్పారు. డిపిఆర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు ప్రారంభించేందుకు కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి, ఎలమంచిలి రైల్వే స్టేషన్ల సాఫ్ట్ అప్‌గ్రేడేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్లాట్‌ఫాం, వేయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, ఎఫ్‌ఓబి పనులు దాదాపు పూర్తవుతున్నాయని తెలిపారు. బయ్యవరం గూడ్స్‌షెడ్ డెవలప్‌మెంట్ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి విస్తరణ ప్రాజెక్టు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ మాట్లాడుతూ ఎలమంచిలి బైపాస్ మార్గంలో పూర్తి స్థాయి సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, రైల్వే వంటి శాఖలు తమ పరిధిలో ఉన్న అంశాలను గుర్తించి, నివేదికల రూపంలో రాజమండ్రి ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి పంపాలని ఆదేశించారు. జాతీయ రహదారి ప్రాధికార సంస్థ రాజమండ్రి ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్ ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన అన్ని వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, రైల్వే డిఆర్‌ఎం విజయవాడ మోహిత్ సోనాకియా, రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, రైల్వే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలి

అనకాపల్లి : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన లాంటి పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జిల్లా విద్యుత్ కమిటీ సమావేశంలో రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఫీడర్ల సంఖ్య మరింత పెంచాలని, తద్వారా ఓవర్ లోడ్ సమస్యలు తగ్గించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకష్ణ, సుందరపు విజయ కుమార్, పంచకర్ల రమేష్ బాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రయోజిత పథకాలు సామాన్యులకు చేరాలి

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అబివృద్ధి, సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా చూడవలసిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందని దిశ కమిటీ చైర్మెన్, ఎంపీ సిఎం.రమేష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) మాసంతపు సమీక్షా సమావేశం అనకాపల్లి ఎంపీ సిఎమ్.రమేష్ అధ్యక్షతన జరిగింది. ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి, వి.మాడుగుల శాసన సభ్యులు కొణతల రామకష్ణ, సుందరపు విజయ కుమార్, పంచకర్ల రమేష్ బాబు,బండారు సత్యన్నారాయణ మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లాలో పంపిణీ చేస్తున్న యూరియా గురించి, శాఖల వారిగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన పియం.విశ్వకర్మ, పియంఇజిపి, మిషన్ వాత్సల్య, ఆయుష్మాన్ భారత్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ వై.సత్యన్నారాయణ రావు, జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఆర్డీఓలు, షేక్ అయిషా, వివి రమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గీతాంజలిని అభినందిస్తున్న రత్నాకర్

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా డైట్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కాలేజీలో సిఎస్ఎమ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 4వ సంవత్సరం చదువుతున్న ఎస్.గీతాంజలి ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ గూగుల్‌లో "గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్"గా ఎంపికైంది. ఈ సందర్భంగా గీతాంజలిని కళాశాల చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపల్ ఆర్ వైకుంఠరావు, విభాగాధిపతులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రామ్ అనేది అసాధారణమైన నాయకత్వం, సాంకేతిక నైపుణ్యం సాంకేతికత ఆధారిత సమాజ అనుసంధానం పట్ల మక్కువను ప్రదర్శించే ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించే ప్రతిష్టాత్మక ప్రక్రియ అని పేర్కొన్నారు. గూగుల్ అంబాసిడర్, వారి క్యాంపస్ మధ్య వారధిగా వ్యవహరిస్తారని, గూగుల్ టెక్నాలజీలను ఉపయోగించి నేర్చుకోవడానికి, ఆవిష్కరించడానికి పరిష్కారాలను నిర్మించడానికి సహచరులను ప్రేరేపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఎ.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నారా లోకేష్ కృషి ప్రశంసనీయం


మాట్లాడుతున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని స్వరాష్ట్రానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ప్రశంసనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడతలో 21 మందిని, రెండో విడతలో 144 మందిని ప్రత్యేక విమానాల ద్వారా రాష్ట్రానికి చేర్చినట్లు చెప్పారు.


ఎరువుల కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి-వడ్డాది : ఎరువులు అందించాలని కోరుతూ బుచ్చయ్యపేట మండలం వడ్డాది రైతు సేవా కేంద్రం వద్ద వైసిపి ఆధ్వర్యాన శుక్రవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు దొండ నారాయణమూర్తి మాట్లాడుతూ అన్నదాతకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎరువులు అందక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, యూరియా కోసం రోజుల తరబడి రైతు భరోసా కేంద్రాల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఓ పక్క ఇబ్బంది పడుతుంటే మరోపక్క అధికారులు యూరియా కొరత లేదని వదంతులు. అపోహలు నమ్మవద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కోరుకొండ రమణ. నాయకులు గుమ్మడి ప్రసాద్, వెంకటస్వామి, తురాయి మనోహర్, వంగలి అప్పారావు, చింతల నాయుడు, కోవెల సత్యనారాయణ. సయ్యపురెడ్డి కొండబాబు, దొండ జయ నరేష్, పెంటకోట ప్రసాద్, ప్రగడ శ్రీనివాసరావు, సుంకర్ నాగేష్, కోవెల వినయ్, ఏ రాజేష్, కోరుకొండ దాసు, కోరుకొండ శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రంలోని అయ్యన్న విద్యా సంస్థలలో రెండు రోజులపాటు జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం ముగిసింది. అయ్యన్న జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 450 మందికి అప్తమాలజిస్ట్ డాక్టర్ ఎం.రమేష్, ఆప్తో మెట్రిస్ట్ డాక్టర్ వి.మణి ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఐ డ్రాప్స్‌ను పంపిణీ చేశారు. క్యాంప్ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నేత్ర వైద్యులు డాక్టర్ రమేష్ కంటి సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఖాశీం క్యాంప్ నిర్వహించిన శంకర్ ఫౌండేషన్‌కు, అర్క్ స్వచ్ఛంద సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ ఎం.రమేష్, వి.మణి, క్యాంపు కో-ఆర్డినేటర్ హరీష్ వర్మ, స్టాఫ్ కృపారావు, రవి తదితరులను డాక్టర్ ఖాశీం సత్కరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న తాతయ్యబాబు, బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-వడ్డాది : తక్కువ ప్రీమియంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ బత్తుల తాతయ్య బాబుతో కలిసి డ్వాక్రా మహిళలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవనజ్యోతి బీమా యోజన పథకాలతో రూ.2లక్షలు ప్రమాద బీమా, సహజ మరణ బీమా వర్తిస్తుందని చెప్పారు. పిఎంఎస్‌బివైకి 18 నుండి 70 ఏళ్ల మధ్య వయసు వారు ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. పిఎంజెజెబివైకి 18 నుండి 50 ఏళ్ల మధ్య వయసు వారు రూ.436 ప్రీమియం చెల్లిస్తే రూ.2 రెండు లక్షలు సహజమరణ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం వడ్డాది ఐఓబి బ్రాంచ్ పరిధిలో ఈ నెలలో డ్వాక్రా సభ్యులకు మంజూరు చేసిన రూ.1.5కోట్లు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు మంజూరైన బీమా పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక బ్రాంచ్ మేనేజర్ జేయం నాయుడు, బుచ్చయ్యపేట ఏపీఎం రాజబాబు, వెలుగు సిబ్బంది, పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు, స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలను అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా తక్షణం పంపిణీ చేయాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను జిల్లా అధికార యంత్రాంగం బేఖాతరు చేసిందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967కు చేసిన ఫిర్యాదు వివరాలను శుక్రవారం మీడియాకు కాండ్రేగుల వెంకటరమణ వివరించారు.

ఎల్లుప్పి రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఎల్లుప్పి గ్రామ రేషన్ డిపో డీలర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన విరోతి ఉదయ కుమార్, బోదువలస ఎంపీటీసీ భర్త ఉగ్గిన రాము స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎల్లుప్పిలో రేషన్ డీలర్ పాపాన ఎల్లాజీ నాయుడు సుమారు 30 ఏళ్ళ నుండి పాత పంచాయతీ ఆఫీసులో ఎటువంటి అనుమతులు లేకుండా రేషన్ డిపో నడుపుతున్నాడని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఎండిఎం ఆపరేటర్‌గా కాకుండా సుమారు 18 నెలల పాటు రేషన్ డిపోలోనే రేషన్ అందించేవారని పేర్కొన్నారు. దీనిపై తాను స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, దీనిపై విచారణ జరిపి సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదమని తెలిసినా..

- కొట్టుకుపోయిన కాజ్‌వే వద్ద దిగి ప్రయాణం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు కాజ్‌వే వద్ద ప్రమాదమని తెలిసినా నదిలో దిగి ప్రయాణం చేస్తున్న పరిస్థితి నెలకొంది. చీడికాడ మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం వడ్డాది రావాల్సి వచ్చింది. తాచేరుపై కాజ్‌వే కొట్టుకుపోవడంతో వడ్డాది చేరుకోవడానికి మంగళాపురం, అప్పలరాజుపురం, కేజే పురం, ముకుందపురం మీదుగా చుట్టూ 12 కిలోమీటర్లకు పైగా తిరిగి వడ్డాది చేరుకోవాలి. అంత దూరం తిరిగి రావడానికి ఇబ్బంది పడిన మహిళలు విజయరామరాజుపేట వరకు రెండు కిలోమీటర్లు ఆటోలో చేరుకొని విజయరామరాజుపేట వద్ద గల కొట్టుకుపోయిన తాచేరు వంతెన వద్దకు చేరుకున్నారు. ఒకవైపు నీటి ఉధృతి ఓ మోస్తర్‌గా ఉంది. మహిళలు ఒక్కరిని ఒకరు పట్టుకొని నదిలో దిగి ఒడ్డుకు చేరుకున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో నదిలో దిగుతున్నారు. వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది చుట్టూ తిరిగి వెళ్లలేక ప్రమాదమని తెలిసినా కాజ్వే వద్ద నదిలోకి దిగి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన కష్టాలు ఎప్పటికీ తీరుతాయోనని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొట్టుకుపోయిన కాజ్‌వే వద్ద దిగి వెళ్తున్న మహిళలు

కాజ్‌వే పునర్నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

వైసిపి జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్


కొట్టుకుపోయిన తాచేరు కాజ్‌వేను పరిశీలిస్తున్న అమర్‌నాథ్ తదితరులు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వేను పునర్నిర్మించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజ్‌వే కొట్టుకుపోయి నెల రోజులు కావస్తున్నా నేటికీ పునర్నిర్మాణం చేపట్టలేదన్నారు. బిఎన్ రోడ్డులో కొన్ని గ్రామాలు నాలుగు వైపులా నీరు చేరి దీవులుగా మారిపోయాయని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం బిఎన్ రోడ్డుకి రూ.110 కోట్లు, విజయరామరాజుపేట వంతెనకు రూ.6కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యేగా ఉన్న ఈ రోడ్డు కాంట్రాక్టర్ వైసిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి తాము ఎంత ఒత్తిడి చేసినా బిఎన్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంక్రాంతికి రాష్ట్రంలోని రోడ్లన్నీ పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన, ఎమ్మెల్యేలు ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెల రోజులుగా వడ్డాది, మాడుగుల ప్రాంతాలకు రవాణా వ్యవస్థ లేకపోయినా స్థానిక ఎమ్మెల్యేలు డైవర్షన్ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నాయకులు అచ్చం నాయుడు, దొండా నారాయణమూర్తి, కోవెల జనార్ధనరావు, జోగా కొండబాబు, ఎంపీటీసీ కే రమణ, వివిధ గ్రామాల వైసీపీ నేతలు పాల్గొన్నారు.


యూరియా పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిటిసి శ్రీనివాసరావు

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట తదితర రైతు సేవా కేంద్రాల వద్ద శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. బుచ్చయ్యపేట రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం తెల్లవారి నుండే 200 మందికి పైగా రైతులు బారులు తీరారు. ఒక వైపు యూరియా పంపిణీ చేస్తున్నా అది సరిపోకపోవడంతో రైతుల్లో ఆందోళన తగ్గడం లేదు. రైతులకు సరిపడా యూరియాను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఎరువులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -కశింకోట : కసింకోట మండలం నరసింగబిల్లిలో ఆత్మ వారి సౌజన్యంతో వరి పంటపై క్షేత్ర పాఠశాల శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి శరణ్య మాట్లాడుతూ వరి పంటలో ఎరువులు వలన కలిగే ఉపయోగాలు, ప్రాముఖ్యత గురించి వివరించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఉపయోగం వాడే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.నూక శ్రీనివాసరావు ఎఈఓ పి.రామకష్ణ, ఏటీఎం, ఫిరోజ్ ఖాన్ విఎఎ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎపిటిఎఫ్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం బుచ్చయ్యపేట మండల కేంద్రంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు బి శేషు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. మధుకృష్ణ పాల్గొన్నారు.


కరపత్రాలు చూపుతున్న భవన నిర్మాణ కార్మికులు

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : ఈ నెల 15న జరుగు భవన నిర్మాణ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి చందక రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని వెల్చూరు, పెద్ద కలవలపల్లి గ్రామాలలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు, పెండింగ్ క్లైమ్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు ఎస్ రాంబాబు, నాగేంద్ర, రాజు, అప్పారావు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహాశీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో ఉషారాణి, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం, టిడిపి నాయకులు భీమరసెట్టి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-సబ్బవరం : అధికారులు విధి నిర్వహణలో తీరు మార్చుకోవాలని, పోస్ట్‌మాన్ ఉద్యోగం వలే పనిచేస్తే ఉపేక్షించేది లేదని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా రైతులకు అవసరం మేరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గృహ నిర్మాణం, తాగునీరు, విద్యుత్తు సరఫరా, మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సబ్బవరం పంచాయతీలో ఆర్ అండ్ బి స్థలాలలో ఉన్న ఆక్రమణ తొలగించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుకు తాను కృషి చేస్తానని చెప్పారు. పలు శాఖల పనితీరుపై సమీక్షించి మూడు నెలల కిందట సర్వసభ్య సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులను ఆరా తీశారు. అధికారుల పనితీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. అసకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు మాట్లాడుతూ తమ పంచాయతీలోని కొండలలో గ్రావెల్ అక్రమంగా తవ్వుకుంటున్నారని, తమ పంచాయతీ అభివృద్ధి పనులకు గ్రావెల్ తవ్వకాలకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మైనింగ్ శాఖ సూపర్‌వైజర్, తహసీల్దార్ గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు తాము ఇవ్వలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దారు బి చిన్నికృష్ణ, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి రాము, మామిడి లక్ష్మి కొండాజీ, పలు శాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : ఈ నెల 13న శనివారం జరుగు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొనే అన్ని రకాలు కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ గౌరవ ఛైర్‌పర్సన్ కె.విజయ కక్షిదారులకు శుక్రవారం సూచించారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, మోటారు వెహికల్, మనోవర్తి, బ్యాంకు బకాయి, కుటుంబ తగాదాలు, చెక్‌బౌన్స్, వాహనప్రమాద బీమా, లావాదేవీ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్‌తో పొందిన అవార్డు డిక్రీతో సమానమంటూ, అపీల్‌కు తావులేదని సీనియర్ సివిల్ జడ్జి వివరించారు.

మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలకు మనమిత్ర యాప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిడిఓ నాగలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఎండపల్లి గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగంలో అనకాపల్లి జిల్లా తరుపున 10వ తరగతి విద్యార్థి పి.సాగర్, 11వ తరగతి విద్యార్థి యు.అభిలాష్ ఎంపిక కావడంపై శుక్రవారం వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈనెల 13, 14 తేదీలలో కోనసీమ జిల్లా, మండపేటలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సిఎల్ఎన్ ప్రసాద్, పిఈటి వి.సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ కె.చిరంజీవి రావు, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయంపై హర్షం

ప్రజాశక్తి-సబ్బవరం : కూటమి ప్రభుత్వం దసరా రోజున ఆటో డ్రైవర్లకి వాహన మిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడంపై స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకి సబ్బవరం ఆటో డ్రైవర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు కర్రి కనకరాజు, మామిడి శంకర్రావు, సాలాపు వెంకటేశ్వరావు, మిడతాడ మహాలక్ష్మి నాయకులు, బోకం స్వామినాయుడు, గండి దుర్గాప్రసాద్, బంతి కోళ్ల పద్మ, బైలపూడి దేముడు బాబు, శరగడం రాము పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : గుంటూరులో ఈ నెల 13న జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని చోడవరం ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్ వద్ద శుక్రవారం పోస్టల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ, విద్యా కాషాయీకరణపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ నాయకులు నాగదుర్గ, రాజు , నాయుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లాలోని మాకవరపాలెంతో సహా రాష్ట్రంలోని పది కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంతో నిర్మించాలని విడుదల చేసిన జీవో నెంబర్ 590ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, ఆరోగ్య రంగాన్ని లాభాపేక్ష కోసం ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తూ కేబినెట్ నిర్ణయం చేయడం దారుణమన్నారు. జిల్లాలోని మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ ఇప్పటికే కొన్ని భవనాలను గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం జరిగిందని, చివరి దశలోకి వచ్చిన వాటిని పూర్తి చేసి వైద్య సేవలు వెంటనే ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ప్రభుత్వ రంగంలోనే నిర్మాణం చేసి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని వెంకన్న డిమాండ్ చేశారు.

మార్కెట్ కమిటీ సభ్యులుగా నైనంశెట్టి వరలక్ష్మి


నైనంశెట్టి వరలక్ష్మి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం అచ్చర్ల గ్రామానికి చెందిన నైనంశెట్టి వరలక్ష్మి అనకాపల్లి మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమెకు నియామక ఉత్తర్వలు అందాయ. వరలక్ష్మిని మార్కెట్ కమిటీ సభ్యులు నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భర్త, కూటమి నాయకులు రమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

తాచేరు కాజ్‌వే పరిశీలన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు కాజ్వేను శుక్రవారం అనకాపల్లి డీఎస్పీ శ్రావణి సందర్శించారు. కాజ్వే వద్దకు వెళ్లి వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహంలోకి దిగి రాకపోకలు సాగించవద్దని హితవుపలికారు. వడ్డాది పెద్దేరు వంతెనను కూడా పరిశీలించారు. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై ఏ.శ్రీనివాసరావును ఆదేశించారు. ఆమె వెంట ఆర్అండ్ వి సిబ్బంది వున్నారు.

మలేరియాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పట్టణంలోని 84వ డివిజన్ సిరసపల్లి గ్రామంలో మలేరియాపై శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మలేరియా డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా ర్యాలీలో వార్డు కార్పొరేటర్ చిన్నతల్లి నీలబాబు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, జనసేన నాయకులు చేబోలు దుర్గాప్రసాద్, అనకాపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ షణ్ముఖరాజు, సిరసపల్లి ప్రసాద్, చూచుకొండ రమణ, మేడిశెట్టి సంతోష్, సిరశపల్లి సత్తిబాబు, గనిరెడ్డి సాయి, మలేరియా డిపార్టుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

హాసిని మరణంపై విచారణ జరపాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వేములపూడి బిసి గర్ల్స్ హాస్టల్ విద్యార్థిని హాసిని ఎనిమిద తరగతి విద్యార్థిని మరణం పై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. నర్సీపట్నం మండలం వేములపూడి బీసీ గర్ల్స్ హాస్టల్ లో 8వ తరగతి చదువుతున్న హాసిని మాకవరపాలెం మండలం బూరుగుపాలెం చెదిన ఆమెకు శుక్రవారం ఆరోగ్యం బాగోలేదని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి విశాఖపట్నం రిఫర్ చేసిన నేపథ్యంలో మార్గమధ్యంలోనే హాసిని మృతి చెందినట్లుగా తెలిసిందన్నారు. హాసిని మృతి పై పలు అనుమానాలు రావడంతో సమగ్ర విచారణ జరిపాలన్నారు. విద్యార్థిని మృతి విషయాన్ని హాస్టల్ వార్డెన్, బీసీ వెల్ఫేర్ అధికారులు శుక్రవారం సాయంత్రం వరకు గోప్యంగా ఉంచడం తో పలు అనుమానాలకు దారితీస్తున్నాయని దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు జనార్ధన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుడు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి డిప్యూటీ డెంటల్ సర్జన్‌గా డాక్టర్ వై.సునీల్ సురేశ్ రాజు నియమితులయ్యారు. కె.కోటపాడు ఆస్పత్రి నుంచి ఆయన బదిలీపై నక్కపల్లి వచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. దంత సమస్యతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు.



కార్మికులతో ఇన్సూరెన్స్ చేస్తున్న బిపిఎం

పోస్టల్ బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:భారత ప్రభుత్వం పోస్ట్ ఆఫీసుల ద్వారా అందిస్తున్న హెల్త్, వ్యక్తిగత, ప్రమాద బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ బిపిఎం నరిశే దయానంద్ (దిలీప్), పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు కోరారు. నక్కపల్లిలో శుక్రవారం పలువురు కార్మికులతో ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టించారు. ఈ సందర్భంగా వారు పోస్టల్ ఇన్సూరెన్స్ పై అవగాహన కల్పించారు. రోజుకు 2 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే సుమారుగా 10 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. 5 లక్షలు, 10 లక్షలు,15 లక్షలు గా మూడు రకాల ఇన్సూరెన్స్ లు ఉన్నాయని సంవత్సరానికి ఒక్కసారి 350, 555, 755, రూపాయలు చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవవరపు లోవరాజు, నడిగట్ల అప్పన్న,బి రాంబాబు, కర్రి సుబ్బారావు, కర్రి రవి,దేవరపు బుజ్జి అప్పన్న, గణపతి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై పునరాలోచించాలి



సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం:కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల్లో పిపిపి విధానాన్ని ప్రవేశపెట్టడం పట్ల శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షురాలు సుర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన నర్సీపట్నం సర్వసభ్య సమావేశంలో పలువురు నాయకులు చర్చించి వినతిపత్రం అందజేశారు. గురందొరపాలెం సర్పంచ్ వెంకట రత్నం మాట్లాడుతూ, మెడికల్ కాలేజీ నిర్మాణం నిలిచిపోతే ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. విశాఖపట్నం వెళ్లేందుకు 100 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని ప్రభుత్వం ఈ అంశం పట్ల పునరాలోచించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎరువుల పంపిణీ పై ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ప్రతి ఒక్కరు ఈ పంట నమోదు తప్పక చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఎరువుల పంపిణీ నేటికీ గబ్బడ గ్రామానికి అందలేదని సభ్యులు సభలో నిలదీశారు. రూ.600 పెట్టి బహిరంగ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏపీఓ సత్యవతి మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని తెలిపారు అదేవిధంగా కాలనీ నిర్మాణాల వద్ద ఆట స్థలం కేటాయింపులకు చర్యలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణ, పరిపాలనాధికారి రమణబాబు, పలువురు అధికారులు నాయకులు హాజరయ్యారు.

దోమతెరల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాత మల్లంపేట గ్రామ పంచాయతీలోని బుడ్డడపాడు, చంద్రయ్యపాలెం, నిమ్మగెడ్డ, కొత్తపాలెం, ఎన్.గదబపాలెం తదితర గిరిజన గ్రామాల్లో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు వంటి వ్యాధుల నుంచి గిరిజన ప్రజలను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రమణమ్మ, తెలుగుదేశం పార్టీ మండల యువ నాయకుడు గెడ్డం ఆనంద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యువకుని అనుమానాస్పద మృతిపై ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీకి చెందిన చెందిన రామిశెట్టి భాస్కర్ (34) యువకుడి అనుమానాస్పద మరణం పై ఆధువులు, కుటుంబ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ ఎదుట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. బంధువుల కథనం మేరకు... గత సోమవారం ఇంటి వద్ద ఉన్న భాస్కర్ ను అతని స్నేహితులు ముగ్గురు ఇంటికి వచ్చి తీసుకెళ్లారు. గురువారం రాత్రి నర్సీపట్నం మున్సిపాలిటీలోని జోగునాధునిపాలెం కల్వర్ట్ వద్ద మృత దేహాన్ని పోలీసులు సెల్ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించారు. భాస్కర్ మరణం పై అనుమానాలు ఉన్నాయని బంధువులు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృత దేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో ఏరియా హాస్పిటల్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. మృతుడి తల్లి లక్ష్మి నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విచారణ చేస్తున్నాం
డిఎస్పి శ్రీనివాసరావు వెల్లడి

నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడిన మృతుడు భాస్కర్ స్నేహితులు, బంధువులతో నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, టౌన్ సిఐ గోవిందరావు కలిసి మాట్లాడారు. జరిగిన సంఘటనపై విచారణ చేస్తున్నామని చెప్పారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. భాస్కర్ ను తీసుకువెళ్లిన వ్యక్తులు స్థానికంగా ఒక లాడ్జిలో ఉన్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా విచారణ చేస్తామన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

నర్సీపట్నం టౌన్: ముఠా కార్మికుడు భాస్కర్ మృతి పట్ల సమగ్ర విచారణ జరిపాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. నర్సీపట్నం బియం పిఎస్ ట్రాన్స్పోర్ట్ లో ముఠా కార్మిడు గా పని చేస్తున్న రామిశెట్టి భాస్కర్ కల్వర్టు వద్ద మరణించి ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- రావికమతం: ఉద్యోగ, ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ రావిక మతం మండల శాఖ అధ్యక్షులు వి.హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రధానంగా పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలు, 12వ పిఆర్సి కమిషన్, ఐఆర్ వంటి వాటిని పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.వినతి పత్రాన్ని తహసీల్దారు అంబేద్కర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్, గౌరవాధ్యక్షులు ఆర్ బి లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి బి.దేముడు బాబు, శ్రీదేవి, దేవి,సాయి పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ పైలా రామారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు ఇ మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి కె సన్యాసి నాయుడు, అర్బన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి దాలయ్యబాబు పాల్గొన్నారు

ఆనందపురం : ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారంరెండవ రోజున యూనియన్ మాజీ అధ్యక్షుడు గంగాధరుడు సారధ్యంలో తహశీల్దార్ శ్రీనుబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వరాహమూర్తి, బోజంగి శ్రీనివాస్, ఆర్.ఎ.నాయుడు, బాబూరావు, ఎల్.కొండాజీ, తర్లువాడ శ్రీదేవి, రాజేశ్వరి, సత్యగౌరి పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు



మానవహారం చేపడుతున్న విద్యార్థులు

చెడు వ్యసనాలను విడనాడాలి

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఎం.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ధూమపానం, మద్యపాన నిషేధంపై" మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు గ్రామ పురవీధులలో ప్లకార్డులతో నినాదాలు చేస్తూ, ప్రజల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే ప్రమాదాలను వివరించారు. బీడీలు, సిగరెట్లు, గుట్కా, ఖైనీ, పాన్ పరాగ్ వంటివి ఆరోగ్యానికి హానికరమని, క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తాయని తెలియజేశారు. మద్యపానం వల్ల కుటుంబాల జీవితం నాశనమవుతుందని, బాధితుల ఆధారంగా ఉండే కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ విషయాలను నాటకం రూపంలో ప్రజలకు చూపించారు. ఈ నాటకం గ్రామ ప్రజలను ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకారావు, స్కూల్ చైర్మన్ గొల్లవిల్లి అప్పారావు, సైన్స్ ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

15 నుంచి పశువులకు టీకాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం:గ్రామీణ ప్రాంతాల్లో పాడిపశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు నిర్వహిస్తున్నామని పశువైద్యాధికారి నరేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరం వద్ద ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, జడ్పిటిసి సభ్యురాలు సకల రమణమ్మ చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ, పాడి రైతులంతా నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని కోరారు. జడ్పిటిసి సభ్యురాలు సకల రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు పాడు రైతులకు అందే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

వేలం పాట నిర్వహించాలి

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోటలో మండల పరిషత్ వాణిజ్య సముదాయ దుకాణాలకు ప్రభుత్వం నిబంధనలు ప్రకారం తక్షణమే వేలం పాట నిర్వహించాలని, గత ఆగస్టు 25 న స్పందన లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్టు కొత్తకోట ఎం పి టిసి పూడిదేవ చెప్పారు. శుక్రవారం ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ, ఈ దుకాణ సముదాయం వేలం పాటల నిర్వహణలో పలు అవకతవకలు జరుగుతున్నాయన్నారు. మండల పరిషత్ సమావేశం లో పలుమార్లు ఫిర్యాదు చేసి నప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. గ్రామంలో మండల పరిషత్ కు చెందిన సుమారు 16 దుకాణాలు ఉన్నా యన్నారు. వీటికి ప్రతి మూడేళ్ళ కొకసారి వేలం పాట నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. దీన్ని కొందరు గ్రామ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి తమ అనుచరుల పేరట తక్కువ అద్దెకి స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. వాటిని ఎక్కువ అద్దెలకు ఇచ్చుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నా రు. తక్షణమే విచారణ చేపట్టి దుకాణాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో పలు గ్రామాల్లోనూ ముమ్మరంగా శానిటేషన్ పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో గొడిచెర్ల గ్రామంలో శుక్రవారం ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. ప్రతిరోజు ఇంటింటా తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు రమణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.


ప్రజాశక్తి సంచికను ఆవిష్కరిస్తున్న అయ్యన్న

సామాన్యుల పత్రిక ప్రజాశక్తి

- స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం: సామాన్యుల పత్రిక ప్రజాశక్తి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు కొనియాడారు. శుక్రవారం తన స్వగృహంలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించారు. మిగతా దినపత్రికలతో పోల్చుకుంటే ప్రజాశక్తికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తలకు అధికారులు మాత్రమే కాదు నాయకులు కూడా తక్షణమే స్పందిస్తారని తెలిపారు. అటువంటి నిబద్ధత విలువలతో కూడిన పత్రికను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం ఇన్చార్జి సూర్యచంద్ర, గన్నవరం పిఎసిఎస్ అధ్యక్షులు సన్యాసి దేవుడు, నాతవరం మండల టిడిపి అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, ప్రజాశక్తి నర్సీపట్నం డివిజన్ ఇంచార్జ్ రవి శేఖర్, రిపోర్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు

క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం కి చెందిన క్రీడాకారులు మరోసారి ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ వుషు సెలక్షన్స్లో నర్సీపట్నం విద్యార్థినులు మెరిశారు. సంస్కృతి గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా గురువారం జరిగిన పోటీల్లో స్థానిక బి.ఆర్. అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ చెందిన నలుగురు విద్యార్థినులు గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వుషు పోటీలకు అర్హత పొందారు. పి.డి. సాయి పర్యవేక్షణలో ఉషు కోచ్ చేపాడ ప్రియాంక శిక్షణలో సాధించిన ఈ విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ రాజేశ్వరి విద్యార్థినులను అభినందించారు.


నినాదాలు చేస్తున్న దళితులు

52వ రోజుకు దళిత రైతుల దీక్ష

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం దళిత రైతులు చేపట్టిన దీక్షలు 52వ రోజుకు చేరుకుంది. క్వారీ కారణంగా తమ వ్యవసాయ భూములు ధ్వంసమవుతున్నాయని, వెంటనే రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు.ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా దీక్షా స్థలాన్ని సందర్శించలేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి, క్వారీ రద్దుపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి. కోడూరు రైతులు పాల్గొన్నారు.

అర్హులకే రేషన్ అందాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం: గతంలో రేషన్ సరుకులు పక్కదారి పట్టేవని, అటువంటి అవినీతికి తావు లేకుండా నిజమైన అర్హులకే అందే విధంగా చర్యలు చేపట్టడంలో భాగంగానే రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు, శుక్రవారం నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులతో వినియోగదారులు ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు, ప్రధానంగా వలస కార్మికులు ఆ ప్రాంతంలోనే రేషన్ తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల మందికి కార్డులు అందజేస్తున్నామని, అనకాపల్లి జిల్లాకు 5.35 లక్షలు, నర్సీపట్నం నియోజకవర్గానికి 83,879 కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు.మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంను వినియోగించుకోవాలని కోరారు. లక్ష రూపాయలు వేతనం తీసుకుంటున్న మహిళ ఉద్యోగులు కూడా ఉచితంగా ప్రయాణం చేయడం పట్ల ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ కెవిఎల్ఎన్ మూర్తి, ఆర్డీవో వివి రమణ, స్థానిక తహసిల్దార్ రామారావు, జడ్పిటిసి సభ్యురాలు సకల రమణమ్మ, జనసేన పార్టీ నర్సీపట్నం ఇంచార్జ్ సూర్యచంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణ,


స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తున్న అయ్యన్న

వివిధ మండలాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పేదవారికి సక్రమంగా రేషన్ సరుకులు

మాడుగుల:ప్రతి పేదవాడికి ఇబ్బందులు కలుగ కుండా పౌర సరఫరాల శాఖ ను మరింత పటిష్టం చేసి, స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని శాసన సభ్యులు బండారు సత్య నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని వీరనారాయణం గ్రామంలో మాడుగుల, చీడికాడ మండలాలకు సంబంధించిన లబ్ది దారులకు స్మార్ట్ రేషన్ కార్డ్ ను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, బియ్యం ఇతర దేశాలకు బ్లాక్ మార్కెట్ లో తరలి పోవడాన్ని చూసి ఈ టెక్నాలజీని విని యోగించడానికి ముందుకు వచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వాహనాల ద్వారా రోడ్లపై ఎండ, వానలో రేషన్ సరుకులు అందించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు.

అనంతరం మాడుగుల జిల్లా పరిషత్ పాఠశాలలో రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్, బాడ్మింటన్ కోర్టు ప్రారంభించారు.స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల తహసిల్దార్ కె. రమాదేవి, చీడికాడ తహసిల్దార్ కిషోర్ లింకన్, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు నందారపు సన్యాసి రావు, సర్పంచ్ యల్లపు కొండ ప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, చీడికాడ మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుత రావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి లక్ష్మణరావు, పెంటకోట అప్పారావు, రేషన్ డీలర్ల అధ్యక్ష, కార్యదర్శులు చింతా మూర్తి, పెంటకోట జగన్నాథం పాల్గొన్నారు.


కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

వాడీవేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగిన సర్వసభ్యసమావేశం వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు విలువ లేని సమావేశాలు ఎందుకని ఎంపిపి గజ్జలపు మణికుమారి ప్రశ్నించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల విషయంలో కూటమి నాయకులు చెప్పిన విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శించారు. రైతులకు యూరియా పంపిణీ కాక ఇబ్బందులు పడుతున్నారని, అసలు మండలానికి ఎంత యూరియా వచ్చిందని మండల వ్యవసాయాధికారిని సుధాకాణిని ఎంపిపి అడిగారు. అనంతరం యలమంచిలి రఘురామచంద్రపురం, పుత్తడిగైరంపేట సర్పంచ్ తదితరులు పలు సమస్యలపై మాట్లాడారు. వైద్యాధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో దోమ తెరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బాబురావు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి గజ్జలపు మణికుమారి

సీతారాం ఏచూరికి ఘన నివాళి


సీతారాం ఏచూరికి పరవాడ ఫార్మాసిటీలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పరవాడ

సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా పరవాడ ఫార్మా సిటీలో శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి చిత్ర పటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి దేశం గర్వించదగ్గ నాయకుడు అని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్గా కీర్తి పొందారన్నారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్లమెంట్లో పరిష్కారమార్గాలు చూపారని తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి అంకిత భావంతో పేదల పక్షాన నిలబడ్డారని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటం కోసం చివరి వరకు పని చేశారని కొనియాడారు. ప్రపంచంలో అనేక దేశాలతో సంబంధాలు ఉండేవని, నేపాల్కు సలహాలు, సూచనలు చేశారని గుర్తు చేశారు. ప్రపంచ దేశాల్లోనే ఆయనకు సైద్ధాంతిక విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఏచూరి మరణం దేశానికి, దేశ ప్రజలకు తీరని లోటు అని చెప్పారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చేనిజమైన ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.పోతునాయుడు, పి.చిన్నారావు, డి దేముడు, పైడ్రాజు, కనకారావు, కార్మికులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సిపిఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు ఎర్ర దేవుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి అడుగుజాడలలో ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఈ.నాయుడుబాబు. పార్టీ సానుభూతిపరులు జి.అప్పారావు, శెట్టి రాజు, ఎస్ శ్రీనివాస్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లి : మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శుక్రవారం కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, శాఖా కార్యదర్శి ఎం.మహేష్ బాబు, సీనియర్ నాయకులు జీ.కాశీరావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి దేశ రాజకీయాల్లో చాలా కీలకమైన పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడా కాశీ, బి.నూకరాజు, వై.అప్పారావు, ఎం.కాశీ, డి.వీర్రాజు, కె.కాశీ, పి.రమణ, పి.తాతాజీ, ఎస్.సింహాచలం, జీ.సత్యవతి, ఎం.బండమ్మ పాల్గొన్నారు.

రోలుగుంట : సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని రోలుగుంట, గడబపాలెం గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు నేతగా ఎదిగారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారని, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు.


కె.కోటపాడులో...

ప్రజాశక్తి కార్యాలయంలో...

గాజువాక : ఆటోనగర్లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డెస్క్ ఇన్ఛార్జి కె.అప్పలనాయుడు, సబ్ ఎడిటర్ ఆర్కె.నాయుడు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఏచూరి సేవలను స్మరించుకున్నారు.



ప్రజాశక్తి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆ సంస్థ ఉద్యోగులు

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
అనకాపల్లి జిల్లా | శనివారం 13-09-2025 | 8 పేజీలు

పుష్కల సాగునీటి వనరులు, పరిశ్రమలు

- నాటికీ, నేటికీ ఎంతో తేడా
- గ్రామీణం నుంచి పారిశ్రామికం వైపు
- అనకాపల్లి జిల్లా అభివృద్ధికి విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి - అనకాపల్లి, పరవాడ విలేకరులు

రాష్ట్రంలో అనకాపల్లి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. సాగునీటి వనరులు, పరిశ్రమలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. బెల్లంతో ప్రసిద్ధిగాంచిన ఈ జిల్లా మరెన్నో విశిష్టతలనూ కలిగిఉంది. 2022లో ఉమ్మడి విశాఖ నుంచి విడివడి జిల్లాగా ఏర్పడిన అనకాపల్లి నేడు పలు మార్పులను సంతరించుకుంది. జిల్లా అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. పటిష్ట ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకెళ్తే అభివృద్ధి కలలు నిజమవుతాయి.

అపారమైన జలవనరులు, వాటికి తగ్గట్టు రిజర్వాయర్లు అనకాపల్లి జిల్లా సొంతం. గతంలో పెద్ద సంఖ్యలో జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న గ్రామీణ ప్రాంతంలో పంటపొలాలు సస్యశ్యామలం కావడానికి ఈ రిజర్వాయర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పలు రిజర్వాయర్లు పూర్తి కాకుండా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా, మేజర్ ప్రాజెక్టుల కారణంగా వేలాది ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందుతోంది. దేవరాపల్లి మండలం రైవాడ వద్ద నిర్మించిన వారాడ నారాయణమూర్తి జలాశయం ద్వారా సుమారు 22 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం మండలాలతో పాటు, విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతోంది. విశాఖ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. మాడుగుల మండలం రావిపాలెం వద్ద నిర్మించిన తెన్నేటి విశ్వనాధం జలాశయం ద్వారా మాడుగుల, బుచ్చయ్యపేట, రావికమతం మండలాల్లో 19 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. చీడికాడ మండలం కోణాం వద్ద నిర్మించిన (మిగతా 8లో..)



రైవాడ జలాశయం



పరవాడ సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం బీచ్‌లు...

చూడచక్కని ప్రదేశాలు..



తిక్కవానిపాలెం తీరం

- పర్యాటక, సినిమా పరిశ్రమలకు కొత్త గమ్యస్థానాలు
- ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ దృశ్యాలకు నిలయాలు
- అభివృద్ధి చేస్తే మరింత పర్యాటక ఆదరణ ఖాయం

ప్రజాశక్తి - పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని సముద్ర తీరప్రాంతాలు కొన్నేళ్లుగా పర్యాటక, సినిమా పరిశ్రమలకు కొత్త గమ్యస్థానాలుగా అవతరిస్తున్నాయి. ముఖ్యంగా ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం బీచ్‌లు అపూర్వమైన సహజ సౌందర్యంతో దేశ, విదేశ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. నీలి సముద్ర అలలు, తెల్లని ఇసుక తిన్నెలు, పచ్చని కొబ్బరి తోటలు, చల్లని గాలులు, ప్రశాంత వాతావరణం ఈ బీచ్‌ల ప్రత్యేకత.

సూర్యోదయ, సూర్యాస్తమయాల అందాలు

ముత్యాలమ్మపాలెంలో సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో భానుడి అపురూప దృశ్యాలు ఎటువంటి వారైనా తన్మయులు కావాల్సిందే. సముద్రపు అంచు నుంచి మెల్లగా పైకి ఎగసి వస్తూ ఆకాశాన్ని నారింజ రంగులో ఆవిష్కృతమయ్యే ఆదిత్యుని ఆగమనం ముత్యాలమ్మపాలెం బీచ్‌కు ప్రత్యేక ఆకర్షణ. ఇక సాయంత్రం సముద్రంలో సూర్యుడు మాయమవుతుండగా ఆకాశం ఎర్రటి, పసుపు, ఊదా రంగుల మిశ్రమంలో కళకళలాడుతుంది. ఫోటోగ్రాఫర్లకు, సినిమా దర్శకులకు ఇది మాయాజాలంలాంటి క్షణం.



ప్రకృతి సౌందర్యం

చారిత్రకం, మత ప్రాధాన్యం

ముత్యాలమ్మ దేవాలయం ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రం. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఏటా ఆనవాయితీ నిర్వహించే జాతర మరింత ప్రత్యేకమనే చెప్పాలి. వేలాది మంది భక్తులతోపాటు కులమతాలకు అతీతంగా అనేకమంది ఈ వేడుకల్లో పాల్గొంటారు. సముద్ర తీరంలో కొలువైన ఈ ఆలయం పర్యాటక, ఆధ్యాత్మిక యాత్రికులను ఆకర్షిస్తుంది.

రవాణా సౌకర్యం దూరం

పరవాడ మండలంలోని సముద్ర తీర అందాలకు కొదవ లేకున్నా, వాటిని తిలకించి, ఆస్వాదించాలనుకునే పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు అక్కడకు వెళ్లడం దూరాభారమనే చెప్పాలి. ముత్యాలమ్మపాలెం బీచ్‌కు వెళ్లాలంటే విశాఖ నుంచి 35 కి.మీ, అనకాపల్లి నుంచి 24 కిలోమీటర్లు భారంగా ప్రయాణించి వెళ్లాల్సిందే. ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి వరకు ఆర్‌టిసి బస్సులు ఉంటాయి. వాడచీపురుపల్లి నుంచి ఆటోలు, క్యాబ్‌లు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. ఇన్ని అందాలు నెలకొన్నా, అక్కడకు నిత్యం వెళ్లే సందర్శకులు అంతంత మాత్రమే. అయితే వారాంతం, ప్రత్యేక దినాల్లో మాత్రం ఇక్కడ సందర్శకుల సందడి అమితంగానే ఉంటుందని చెప్పొచ్చు

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రోడ్ల విస్తరణ, వీక్షణ గోపురం, లైటింగ్ సౌకర్యం, పార్కింగ్ ప్రదేశాలు, ఫుడ్ కోర్టులు, బీచ్ క్రీడల మైదానం ఏర్పాటు జరుగుతోంది. త్వరలో ఈ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటక సర్క్యూట్‌లో చేర్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

టీవీ, సినిమా షూటింగ్‌లకు అద్భుత లోకేషన్లు

నిత్యం పర్యాటకులు వెళ్లేందుకు ఒకింత కష్టమైనా, ఇక్కడున్న ప్రకృతి సోయగాలు, అపురూప దృశ్యాలతోపాటు, ప్రశాంతతతో కూడిన వాతావరణం అనేక టీవీ సీరియళ్లు, సినిమాలతోపాటు ప్రత్యేక ఆల్బమ్స్ షూటింగ్‌లకు అద్భుత అవకాశంగానే ఉందనే చెప్పాలి. ఇప్పటివకు మన్మథుడు 2 (నాగార్జున, రకుల్ ప్రీత్ సింగ్), జులాయి (అల్లుఅర్జున్, ఇలియానా), అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి (రవితేజ అసిన్), రంగస్థలం (రామ్ చరణ్, సమంత), సరైనోడు (అల్లుఅర్జున్) వంటి సూపర్‌హిట్ సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకున్నాయి. చిత్రషూటింగ్‌లు జరిగే రోజుల్లో ఇక్కడి గ్రామాలకు కళాత్మక శోభ ఉట్టిపడుతుంది. ఆర్టిస్ట్‌లుగా, సహాయక సిబ్బందిగా పలువురు స్థానికులు అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.

ఆర్థిక ప్రయోజనాలు

పర్యాటకుల రాకతో స్థానికులకు చేపల వేట, హస్తకళ ఉత్పత్తుల విక్రయం, చిన్న హోటళ్లు, గైడ్ సేవలు, ఫోటోగ్రఫీ వంటి వివిధ రూపాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. జాతర కాలంలో హోటళ్లు, స్టాళ్లు, బోటు ప్రయాణాలు మంచి ఆదాయాన్ని ఇస్తున్నాయి.



పర్యాటకులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు

సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి చేస్తే...

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెంలోని బీచ్ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తే బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలనిస్థానికులు కోరుతున్నారు. సినిమా షూటింగ్‌ల అనుమతి కేంద్రం ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, శుభ్రత చర్యలు, మౌలిక సదుపాయాల విస్తరణ, పర్యాటక సమాచారం కేంద్రం ఏర్పాటు వంటివి ప్రభుత్వపరంగా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక పటంలో ప్రత్యేక స్థానం

పరవాడ తీరప్రాంతాలు, ముఖ్యంగా ముత్యాలమ్మ పాలెం, తిక్కవానిపాలెం బీచ్‌లు రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక పటంలో ప్రత్యేక స్థానం సంపాదించనున్నాయి. సముద్రతీర సోయగాలు, మత ప్రాధాన్యం, సినిమా చిత్రీకరణలు ఈ ప్రాంతాన్ని పర్యాటక, సినిమా హబ్‌గా మరింత ప్రసిద్ధి చేస్తుందనడంలో సందేహం లేదు.



ముత్యాలమ్మపాలెంలో సూర్యోదయ వేళ మనోహర దృశ్యం

డిఎస్ఎన్ఎల్‌యులో అత్యుత్తమ న్యాయ విద్య



దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డిఎస్ఎన్ఎల్‌యు) దేశంలోనే అత్యుత్తమ న్యాయ విద్యను అందిస్తోంది. ఆధునిక న్యాయ విద్యలో అగ్రగామిగా నిలుస్తూ, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ వర్సిటీ క్రమంగా ప్రతిష్టను మరింత పెంచుకుంటోంది. విశాఖపట్నం నగరానికి అతి సమీపంలో అందమైన ప్రదేశంలో విస్తరించి ఉన్న ఈ విశ్వవిద్యాలయం, న్యాయవిద్యను కొత్త దారిలో తీర్చిదిద్దుతూ అనేక ప్రతిభావంతులైన న్యాయవేత్తలను తయారు చేస్తోంది.

ప్రతిష్టాత్మక న్యాయ విద్యాసంస్థ

2010లో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టడం విశేషం. దేశంలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల (ఎన్ఎల్‌యు) సరసన చేరి అగ్రశ్రేణి విద్యను అందిస్తోంది. ఇక్కడి పాఠ్య ప్రణాళిక అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండటం, ప్రాక్టికల్ ట్రైనింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టడం, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. ఈ విశ్వ విద్యాలయంలో బిఎ, ఎల్ఎల్‌బి (5 సంవత్సరాల కోర్సు), ఎల్ఎల్ఎం ఒక ఏడాది కోర్సు, ఎల్ఎల్‌బి (3 సంవత్సరాల కోర్సు), పిహెచ్‌డి, ఎల్ఎల్‌డి వంటి కోర్సులు ఉన్నాయ. దేశ వ్యాప్తంగా నిర్వహించి క్లాట్ ఎంట్రన్స్ టెస్టు ద్వారా వచ్చన ర్యాంకుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు పొందవచ్చు.

నిష్ణాతులైన అధ్యాపక బృందం

న్యాయరంగంలో అనుభవం కలిగిన అధ్యాపకులు, లా కళాశాలల మాజీ ప్రిన్సిపాళ్లు, జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు విద్యార్థులకు న్యాయ విద్యను బోధించడం ఈ విశ్వవిద్యాలయ ప్రత్యేకత. 30 మంది అధ్యాపకులతో న్యాయ సిద్ధాంతం మాత్రమే కాకుండా, కోర్టు ప్రాక్టీస్, న్యాయ పరిశోధన, మాక్ ట్రయల్స్, మూట్ కోర్ట్ పోటీలు వంటి అంశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

న్యాయవిద్య తో ఉపాధి అవకాశాలు

ఇక్కడి నుండి పట్టభద్రులైన విద్యార్థులు దేశంలోని అగ్రశ్రేణి కోర్టుల్లో, కార్పొరేట్ సంస్థల్లో, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందుతున్నారు. నాలుగు



స్నాతకోత్సవంలో న్యాయశాస్త్ర డిగ్రీ పట్టాలు పొందిన న్యాయ విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ఐపిఎల్ క్రికెట్ టీం మేనేజ్‌మెంట్‌లకు అడ్వైజర్లుగా పూర్వ విద్యార్థులు పనిచేయడం విశేషం. ఎపి హైకోర్టులో 70 మంది, తెలంగాణ హైకోర్టులో 70 మంది పూర్వ విద్యార్థులు న్యాయవాదులుగా, జడ్జిలుగా పనిచేస్తున్నారు. పలువురు విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యావకాశాలు కూడా పొందుతున్నారు.

సమాజానికి సేవ

డిఎస్ఎన్ఎల్‌యు విద్యార్థులు కేవలం కెరీర్ దృష్టితోనే కాకుండా సామాజిక న్యాయం, పేదలకు ఉచిత న్యాయ సహాయం, లీగల్ అవేర్నెస్ కార్యక్రమాల్లో కూడా ముందుండి పనిచేస్తున్నారు. ఈ విధంగా విశ్వవిద్యాలయంలోని లీగల్ సర్వీస్ సెంటర్ 'న్యాయం అందరికీ' అనే లక్ష్యాన్ని సాధించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో వివిధ వర్గాల వారికి ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందిస్తున్నారు.

పరిశోధనలు -భవిష్యత్తు లక్ష్యం

దేశంలోనే అత్యుత్తమ న్యాయ విద్యా కేంద్రంగా ఎదగాలని డిఎస్ఎన్ఎల్‌యు ప్రయత్నిస్తోంది. పరిశోధన, న్యాయ సంస్కరణలు, అంతర్జాతీయ సహకారాల ద్వారా విద్యార్థులకు మరింత గ్లోబల్ అవకాశాలు కల్పించే దిశగా ఈ విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది. ఈ విశ్వ విద్యాలయంలో ఐపిఆర్ చైర్ కింద పరిశోదనలకు ఒక కోటి రూపాయల వరకు జాతీయ ఫండ్స్ ప్రతి సంవత్సరం అందిస్తుంది. ఈ వర్సిటీలో సెంటర్ ఫర్ విమెన్ అండ్ చైల్డ్ లా, కార్పొరేట్ లీగల్ రీసెర్చ్, లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, క్రిమినల్ లా సెంటర్, ఎన్విరాన్మెంటల్ లా సెంటర్, స్పోర్ట్స్ లా అండ్ పాలసీ సెంటర్, లా అండ్ పబ్లిక్ పాలసీ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లా సెంటర్, సెంటర్ ఫర్ అవియేషన్ అండ్ స్పేస్ లా, సెంటర్ ఫర్ ఎడిఆర్ వంటి ప్రత్యేక పరిశోధన కేంద్రాలు ఉన్నాయి.

నాక్ అక్రిడేషన్ కోసం ప్రయత్నిస్తున్నాం



సువిశాలమైన 48 ఎకరాల విస్తీర్ణంలో రూ.130 కోట్లతో విశ్వ విద్యాలయం రూపు దిద్దుకుంది. ఈ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి కులపతిగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నారు. విజిటర్‌గా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పిఎస్.నరసింహం పని చేస్తున్నారు. దేశంలో 27 జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. అందులో ఎపిలో ఉన్న డిఎస్ఎన్ఎల్‌యు, తెలంగాణలో నల్సర్ లా విశ్వ విద్యాలయం ఉన్నాయి. విశ్వవిద్యాలయానికి నాక్ (ఎన్ఎఎసి) అక్రిడేషన్ కోసం ప్రయత్నం చేస్తున్నాం. వర్సిటీలో ఆడిటోరియం నిర్మాణం కావాల్సి ఉంది. ఇటీవల 8, 9, 10, 11, 12 స్నాతకోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం. కళాశాల ప్రాంగణంలో ఇటీవల గాంధీ, అంబేద్కర్, దామోదరం సంజీవయ్య విగ్రహాలను కులపతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీరజ్ సింగ్ ఠాకూర్, విజిటర్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నరసింహం ఆవిష్కరించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్, న్యూ అకాడమిక్ బ్లాక్‌లు ప్రారంభించడం జరిగింది.

- ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు,
డిఎస్ఎన్ఎల్‌యు ఉపకులపతి



ఇటీవల అకడమిక్ కాంప్లెక్స్ బ్లాక్‌ను ప్రారంభించిన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

సహజసిద్ధ అందాలకు నెలవు...

కొండకర్ల ఆవ!

- ★ పర్యాటక ప్రదేశంగా విశిష్ట గుర్తింపు
- ★ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో జీవనోపాధి
- ★ అభివృద్ధి చేస్తే మరింత పర్యాటకాదరణ



ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండకర్ల ఆవలో అందాలకు అంతు లేదు. ఆహ్లాదకరమైన ప్రదేశంగా కొండకర్ల ఆవ రోజు రోజుకూ సందర్శకులను అమితంగా ఆకర్షిస్తూ తన వద్దకు రప్పించుకుంటోంది. పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతున్న కొండకర్ల ఆవలో మరిన్ని సౌకర్యాలను కల్పించి, అభివృద్ధి చేయగలిగితే ప్రపంచస్థాయి సందర్శనీయ ప్రదేశంగా రూపుదిద్దు కుంటు ఒదనడంలో అతిశయోక్తి లేదు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మునగపాక మండలాల మధ్యలో 1400 ఎకరాలు విస్తీర్ణంలో కొండకర్ల ఆవ విస్తరించి ఉంది. ఈ ఆవ అందాలను గుర్తించిన మన దేశాన్ని పరిపాలించిన బ్రిటీష్ దొరలు అప్పట్లోనే దీన్ని తిలకించడానికి అమితాసక్తి చూపేవారంటే దీని విశిష్టత ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అవను పర్యాటక రంగంగా తీర్చిదిద్దడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, అధికారులు అనేకసార్లు ఆవలో బోట్లపై షికార్లు చేశారు. అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. అప్పటినుండి ఆవ పరిసర ప్రాంతాలు దినదినాభివృద్ధి చెందుతూ, పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్షించే విధంగా ప్రకృతి రమణీయ,సౌందర్యవంతమైన ప్రదేశంగా వర్ధిల్లుతుంది.

కొండకర్ల ఆవ విశిష్టత

ఆవ చుట్టూ ఎత్తైన కొండలు, తూర్పు వైపునకు చూస్తే ఎన్‌టిపిసి సింహాద్రి థర్మల్ విద్యుత్ పాజెక్టునకు సంబంధించి ఆసియా ఖండంలోనే అతి ఎత్తైన పొగ గొట్టం కనిపిస్తుంటుంది. హరిపాలెం కొండపై భగీరథీ అమ్మ వారి ఆలయం, వాడ్రాపల్లి కొండపై వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆవ మధ్యలో శివలింగం వంటి ప్రత్యేకతలు ఎన్నో కనిపిస్తుంటాయి.

ఆవలో దేశ విదేశాల నుంచి వచ్చే పక్షుల కిలకిలారావాలు పర్యాటకుల మనసు దోచేస్తుంటాయి. నీటిలో జల క్రీడలాడుతూ కనిపించే అనేక రకాలైన చేపలు చూసి ఎవరైనా మంత్రముగ్ధులు కావాల్సిందే. ఆవ గర్భంలోంచి పుట్టుకొచ్చి నీటిపై తేలియాడుతూ సూర్యరశ్మికి వికసించే కలువపూల అందాలు వర్ణనాతీతం. ఆవలో పర్యటించే పర్యాటకులు కలువ పువ్వులను తమ వెంట తీసుకుని వెళ్లలేని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కలువపూలపై పర్యాటకుల ఆకర్షణ నిరుమానమని చెప్పక తప్పదు.

200 కుటుంబాలకు ఆవ సంపద జీవనాధారం

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండకర్ల ఆవ, రమణీయమైన అందాలకు నెలవే కాకుండా,కొండకర్ల, వాడ్రాపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలకు జీవనాధారం. ఆవలో దొరికే చేపలు, ఇందులోనే పుట్టిన కలువపూలు, ఆవ దుంపలతోపాటు ఇక్కడకు వచ్చే పర్యాటకులను ఫైబర్ తెప్పలపై తిప్పుతూ వాటి ద్వారా వచ్చిన ఆదాయం ఇలా, పలువిధాలుగా ఎందరికో కొండకర్ల ఆవ జీవనాధారంగా నిలుస్తోంది.



ఆవలో దొరికే కొర్రమీను (సవడ) బొచ్చు, శీలావతి, మట్ట పిల్లలు, వంటి చాపలు చేపలు వంటి చేపలకున్న డిమాండ్ అంతాఇంతాకాదు, వాటిని పట్టి వాటి విక్రయం ద్వారా 200 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆవలోని కలువపూలను పూజా కార్యక్రమాల్లో వినియోగానికి భక్తులు ఎనలేని ఆదరణ చూపుతుంటారు. ఆవదుంపలను సేకరించి గ్రామాల్లో విక్రయించడం ద్వారా మరికొన్ని కుటుంబాలు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి.



కొండకర్ల ఆవలో పక్షుల కిలకిలారావాలు

ఇక ఆవ అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకుల ద్వారా కూడా స్థానికులకు వివిధ రూపాల్లో ఆదాయం సమకూరుతోంది. సందర్శకులను ఫైబర్ తెప్పలపై తిప్పి ఆవ అందాలను చూపిస్తూ కొందరు రోజువారి ఆదాయం సంపాదిస్తారు. పర్యాటకుల తాకిడితో ఆవ తీరాన చిల్లర వర్తకులు వ్యాపారం చేసి పొందిన లాభంతో మరి కొంతమంది లబ్ధి పొందుతున్నారు. పర్యాటకుల కు ఆశ్రయం కల్పించడానికి ఆవ చుట్టూ విశ్రాంతిభవనాలు వెలుస్తున్నాయి. విశ్రాంతి భవనాలు నిర్మించి వాటిపై వచ్చే ఆదాయంపై అనేక మంది పోటీ పడుతున్నారు. ఇదే సమయంలో ప్రశాంత వాతావరణంలో ఉన్న విశ్రాంతి భవనాలు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మృత్యునిలయాలుగా మారడం మాయని మచ్చగానే చెప్పొచ్చు

ఆక్రమణలతో చెరిగిపోతున్న సరిహద్దులు

కొండకర్ల ఆవ ఆక్రమణలకు నిలయంగా మారుతుంది. బ్రిటిష్ ప్రభుత్వంలో ఏర్పడిన ఆవ సరిహద్దులను ఆక్రమణదారులు చెరిపేస్తున్నారు. భవన నిర్మాణాలు, చెట్ల పెంపకాలు, వివిధ రకాల నిర్మాణాలతో ఆవను ఆక్రమించేస్తూ నానాటికీ కుదించిపోయేలా చేస్తున్నారు. ఆక్రమణకు రెవెన్యూ యంత్రాంగం వంత పాడడం దురదృష్ట కరమని స్థానికులతోపాటు పర్యాటకులు సైతం పెదవి విరుస్తున్నారు.

కనుమరుగౌతున్న చారిత్రక గురుతులు

బ్రిటిష్ కాలంలో నిర్మించిన ప్రభుత్వ విశ్రాంతి భవనం నేల కూలింది. వంటశాలలు, గుర్రపుశాలలు, ఏనుగుల నివాస ప్రదేశాలు వంటివి నేడు కనిపించలేదు. ఆవ అభివృద్ధికి అనకాపల్లి ఎంపీగా గంటా శ్రీనివాసరావు హయాంలో రూ.23 లక్షలతో ప్రత్యేకంగా రహదారిని నిర్మించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హయాంలో ఆవలో ఫైబర్ బోట్లు, జెట్టి నిర్మాణం చేపట్టారు. సిమెంట్ రోడ్లు నిర్మించారు. ప్రజా ప్రతినిధులు పలుమార్లు ప్రతిపాదించిన ఆవ అభివృద్ధి పనులకు సరైన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదు ప్రకృతి ప్రసాదించిన కొండకర్ల ఆవను మరింతగా అభివృద్ధి చేసి, సౌకర్యాలను కల్పించే, పర్యాటకాదరణ ప్రదేశంగా మరింత పురోభి వృద్ధి సాధించి, ఎందరికో ప్రత్యక్షం గా, పరోక్షంగా ఉపాధి కల్పించడంతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాకు, ప్రస్తుతం విభజిత అనకాపల్లి జిల్లా ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేస్తుం దనడంలో అతిశయోక్తి లేదు.



కొండకర్ల ఆవ వద్ద పర్యాటక సందడి

గతమెంతో ఘనం..

- దేశంలోనే రెండో అతి పెద్ద బెల్లం మార్కెట్‌గా గుర్తింపు
- గిట్టుబాటు లేక, పెట్టుబడులు పెరిగి భారీగా తగ్గిన దిగుమతులు
- ప్రాభల్యం కోల్పోతున్న అనకాపల్లి బెల్లం



అనకాపల్లి బెల్లం మార్కెట్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి అంటే టక్కున గుర్తుకు వచ్చేది బెల్లం. భారతదేశంలోనే ఉత్తరప్రదేశ్లో అపూర్ ప్రథమ స్ధానంలో ఉండగా రెండో అతిపెద్ద మార్కెట్టుగా అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు పేరు ఉంది. అనకాపల్లి బెల్లం రుచిని దేశం నలుమూలలకు విస్తరించిన వర్తక ప్రముఖుల్లో కీర్తిశేషులు ఉప్పల సత్యనారాయణశెట్టి, ఉప్పల పెద వెంకటరమణయ్య శెట్టి, ఉప్పల శ్రీరామ్మూర్తి శెట్టి, కొణతాల సుబ్రహ్మణ్యం, సేఠ్ జవాన్ మల్ ఉన్నారు. మార్కెటింగ్‌పై వీరుకున్న అవగాహన బెల్లం మార్కెట్ అభివృద్ధితో పాటు వర్తకుల సంక్షేమానికి కూడా దోహదపడింది. అప్పట్లో రైల్వే శాఖకు బెల్లం ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చే ఉప్పల సత్యనారాయణ శెట్టి వంటి బెల్లం వర్తకులకు రైల్వే అధికారులు అత్యంత గౌరవం ఇచ్చేవారు. ప్రస్తుత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తండ్రి కొణతాల సుబ్రహ్మణ్యం అప్పట్లో మార్కెట్‌కు వచ్చిన బెల్లం దిమ్మల్లో సగభాగాన్ని కొనుగోలు చేసేవారు. 1960 తర్వాత శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కూడా అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బెల్లం వస్తూ ఉండేది. దిగుమతి వర్తకంలో కొణతాల సుబ్రహ్మణ్యం, ఎగుమతి వర్తకంలో సేఠ్ జవాన్ మల్ పైచేయిగా ఉండేది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, గుజరాత్, అస్సాం వంటి రాష్ట్రాలకు, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలకు బెల్లం ఎగుమతి చేసిన ఘనత సేఠ్ జవాన్ మల్‌కు దక్కుతుంది. 1950 దశకంలో అండమాన్, శ్రీలంక దేశాలకు నౌకాయానం ద్వారా బెల్లం ఎగుమతి చేశారంటే అనకాపల్లి బెల్లం వ్యాపారం ఏ మేరకు విస్తరించిందో అర్థమవుతుంది. 1976-77 ప్రాంతంలో కోటిదెమ్మలకు పైగా రావడం రికార్డుగా మిగిలింది. అనంతరం ఉభయగోదావరి జిల్లాల్లో బెల్లం ఉత్పత్తి వ్యయం పెరగడం, సుగర్ ఫ్యాక్టరీలు ఇచ్చే మద్దతు ధర ఆశాజనకంగా ఉంటడంతో బెల్లం దిగుమతి తగ్గింది. శ్రీకాకుళం నుంచి బెల్లం తెచ్చే రైతులే వర్తకులుగా మారడంతో ఆ ప్రాంతం నుంచి కూడా బెల్లం దిగుమతి తగ్గింది.

1908లో బాలాజీరావుపేటలో బెల్లం మార్కెట్ ప్రారంభమైంది. స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో ఈ మార్కెట్‌ను గాంధీజీ సందర్శించారు. నాటి వర్తకలు ఆయన పేరు పెట్టుకుంటామని గాంధీజీని అభ్యర్థించగా ఆయన అంగీకరించారు. దీంతో గాంధీ మార్కెట్‌గా నామకరణం చేశారు. తరువాత 1956లో విశాఖపట్నం జిల్లా మార్కెట్ కమిటీ అనకాపల్లిగా అవతరించింది. తరువాత 2001లో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కృషి ఫలితంగా చెర్లోపల్లి ఖండంలో రూ.17 కోట్లుతో 33 ఎకరాల 22 సెంట్లులో మార్కెట్‌ను నిర్మించి డాక్టర్ ఎన్టీ రామారావు మార్కెట్ యార్డ్‌గా అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (ఎఎంసి)గా నామకరణం చేశారు. ఏఎంసీ ఏర్పడిన తర్వాత దీని పరిధి అనకాపల్లి, మునగపాక, పరవాడ, సబ్బవరం, కశింకోట మండలాలకు చెందిన 148 గ్రామాలకు విస్తరించగా ప్రస్తుతం అనకాపల్లి, కశింకోట మండలాలలో 62 గ్రామాలకు మాత్రమే పరిమితమైంది. గతంలో బెల్లంతో పాటు వరి బియ్యం, జీడిపప్పు, సరుగుడు, మొక్కజొన్న పల్సస్, చేపలు, ఇతర పంటలు కూడా మార్కెట్ జరిగేవి. 2005-06లో 12,978 లక్షల విలువచేసే 72 లక్షల 98 వేల 788 క్వింటాళ్లు మార్కెట్ జరిగింది. ప్రస్తుతం బెల్లం మినహా ఇతర పంటలేవీ ఎఎంసికి రావడం లేదు.

బెల్లం ఉత్పత్తి వ్యయం పెరగడం, కూలీల కొరత కారణంగా జిల్లాలో చెరకు పంట గణనీయంగా తగ్గింది. దీంతో బెల్లం ఉత్పత్తి తగ్గి వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే బెల్లం కూడా తగ్గిందని చెప్పవచ్చు.

ప్రస్తుతం అనకాపల్లి వ్యవసాయ మార్కెట్లో 33 కమిషన్ ఏజెంట్లు, 32 మంది వ్యాపారులు, 24 మంది బియ్యం వ్యాపారులు, 43 మంది ఇతర వ్యాపారులు ఉన్నారు. గతంలో 500 పైబడి ఉండే హమాలీలు, వేమ్యాన్స్ ప్రస్తుతం 124 మంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది 34 శాంక్షన్ పోస్టులు ఉండగా కేవలం నలుగురు మాత్రమే పని చేస్తూండగా 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో 21 పోస్టులకు గాను 18 మంది పనిచేస్తున్నారు.

ఎఎంసిలో సౌకర్యాలు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు, వ్యాపారులకు సౌకర్యార్థం సులాబ్ కాంప్లెక్స్, రైతు విశ్రాంతి భవనం, క్యాంటీన్ భవనం ఉన్నాయి. హోల్ సేల్, రిటైల్ వ్యాపారం కోసం చేపల, కూరగాయలు, పండ్లు బజారు కోసం నిర్మాణాలు చేపట్టినా అవి నిరుపయోగంగా ఉన్నాయి.

గత పదేళ్ల వ్యాపార లావాదేవీలను పరిశీలిస్తే...
2015-16లో అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు 109 కోట్ల 18 లక్షల 30 వేల 284 రూపాయల విలువచేసే 4,81,694 క్వింటాళ్ల బెల్లం దిగుమతి కాగా, 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 42 కోట్ల 12 లక్షల 2వేలా 291 రూపాయల విలువ చేస్తే లక్ష 14 వేల 697 క్వింటాళ్ల బెల్లం మాత్రమే వచ్చింది.

తగ్గిన ఆదాయం..

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌కు సెస్సుల, చెక్ పోస్ట్‌లు, దుకాణ సముదాయాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. బెల్లం దిగుమతి తగ్గడంతో మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయం కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడేళ్ల ఆదాయాన్ని పరిశీలిస్తే 2016-17లో 243.43 లక్షల ఆదాయం రాగా 2023-24లో కేవలం 150.16 లక్షల రూపాయల ఆదాయం మాత్రమే వచ్చింది. దీనిని మార్కెట్ నిర్వహణ, సిబ్బంది జీతాలకు వెచ్చిస్తున్నారు.

తగ్గిన చెరుకు సాగు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలో చెరుకు, వరి ప్రధాన పంటలు. అయితే ఈ పంటలు వేసిన దగ్గర నుండి చేతికి వచ్చేదాకా రైతులు భయందోళనలో ఉంటున్నారు. ఒకప్పుడు అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు ఎక్కువగా బెల్లం తీసుకెళ్లేవారు. నేడు రైతుల్లో బెల్లంపై అనాసక్తి ఏర్పడింది. చెరుకు నుండి దిగుబడి తగ్గడం, గిట్టుబాటు కాకపోవడంతో చెరుకు సాగు కూడా తగ్గింది. చెరుకు గెడ నుండి రసం తగ్గిపోయింది. గతంలో ఒక పాకం నుండి 10 దిమ్మలు వచ్చేవి. కాని నేడు ఏడు లేక ఎనిమిది దిమ్మలు మాత్రమే వస్తున్నాయి. గతంలో ఎటువంటి రసాయనాలు లేకుండా తుమ్మది ఆకు, సున్నం వేసి బెల్లం తయారు చేసేవారు. కాన నేడు రకాల రసాయనాలు వేసి బెల్లంగా తెల్లగా తయారు చేస్తున్నారు. కూలి ధరలు కూడా పెరిగాయి. దీంతో పెట్టుబడి వ్యయం పెరగడం, దిగిబడి తగ్గడం, గిట్టుబాటు కాకపోవడంతో చెరుకు సాగు తగ్గిపోయింది.

కేజీ దిమ్మలతో రైతుకు మేలు

తక్కువ మోతాదులో పండించే చెరుకు క్రషర్లు వద్ద బెల్లం వండి కేజీలు చొప్పున దిమ్మలు తయారు చేసి క్రెషర్లు వద్ద రూ.50కు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇది రైతుకు కొంత లాభదాయకంగా ఉందని రైతులు అంటున్నారు. ఈ కేజీ బెల్లం దిమ్మ కోసం వాహనదారులు, ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు.



కేజీ బెల్లం దిమ్మలు అమ్ముతున్న దృశ్యం

అందరికీ అందుబాటులో తాళ్ళపాలెం సంత

పలు ప్రాంతాల నుంచి వ్యాపారుల రాక ▸▸ కూరగాయలు, పొట్టేళ్లు, కోళ్లు భారీగా విక్రయాలు

ప్రజాశక్తి- కశింకోట: కసింకోట మండలం తాళ్లపాలెంలో జరిగే సంత అందరికీ అందుబాటులో ఉండటంతో పలు రకాల అమ్మకాలు, కొనుగోలు ఎక్కువ సాగుతుంటాయి. ఈ సంత ప్రతి సోమవారం జరుగుతుంది. ప్రధానంగా పొట్టేలు, మేకలు, కోళ్లు కూరగాయలు, మంచాలు, వస్త్రాలు, ఎండు చేపలు, మాంసం, తినుబండారాలు ఎక్కువగా అమ్మకాలు సాగుతుంటాయి. ప్రధానంగా సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి పండుగల్లో జోరుగా అమ్మకాలు సాగుతాయి. విశాఖపట్నం, అనకాపల్లి, విజయ నగరం, తూర్పుగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి పొట్టేలు కొనుగోలు చేసుకుని తీసుకుని వెళుతుంటారు.

ఇటీవల నాబార్డు ద్వారా సుమారు రూ.20 లక్షలతో కూరగాయలు అమ్ముకునేందుకు 20 షాపుల నిర్మాణం చేపట్టారు. ఇవి పూర్తయి వినియోగంలోకి తీసుకువచ్చారు. గతంలో హుదూద్ తుఫాన్‌లో ఇక్కడ



బట్టలు విక్రయం చేసేందుకు శాశ్వత భవనాన్ని నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు

మాంసం, ఎండు చేపల దుకాణాలు, ఇతర చిరు వ్యాపారాలకు వర్షం పడితే కష్టం ఎదురైనట్టే. ఈ సంత లోతు కావడంతో నీరు నిల్వ ఉండిపోవడంతో అమ్మకందారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు చిరు వ్యాపారులు నష్టాన్ని సరిచూడాల్సి వస్తుంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే ఎత్తు చేయాలి. లేకుంటే డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరారు.



రిజర్వాయర్లను బాగు చేస్తే.. సస్యశ్యామలమే...

ప్రజాశక్తి-కశింకోట: కశింకోట మండలంలో నర్సాపురం డామ్, పరవాడపాలెం రంగుబోలు గెడ్డ రిజర్వాయర్లు రైతుల పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. వీటి నుంచి వచ్చే సాగు నీటి ద్వారా చెరుకు, వరి, కూరగాయలు పంటలు రైతులు పండిస్తున్నారు. రంగుబోలు గెడ్డ రిజర్వాయర్ సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ, కుడి కాలువలు రెండు ఉన్నాయి. ఈ కాలువల్లో వర్షాలకు పిచ్చి మొక్కలతో నిండి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. ఉపాధి, ఇతర నిధులతో ఈ కాలువల్లో పూడిక పనులు చేస్తుంటారు. గట్టు పటిష్టంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



ఎత్తు చేయాల్సిన గట్టు ఇదే...

నర్సాపురం డామ్‌లో శారదా నది, మామిడి వాక గెడ్డ, రంగుబోలు గెడ్డల నుండి వచ్చిన నీరు ఇక్కడ నిల్వ ఉంటుంది. ప్రభుత్వం, విశాఖ డైయారీ ద్వారా పలుమార్లు కాలువలు, డామ్ గేట్లు, ఇతర పనులు చేపట్టారు. ఈ డామ్ కుడి, ఎడమ గట్లు ఎత్తు లేక పోవడంతో తుపాన్, వరదలు సమయంలో డామ్ నిండి రెండు వైపులా నిండి పోతుంది. ఆ సమయంలో నీరు పల్లపు ప్రాంతంలో ఉన్న పెరంటాలపాలెం, గంటవానిపాలెం, గణపర్తి, మెలిపాక, చూచికొండ, పంట భూముల గట్ల మీద నుండి నీరు పొంగి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఈ రెండు గేట్ల మరమ్మతు చేపట్టి పంటలకు నష్టం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



నర్సాపురం డ్యామ్



కళా రంగానికి కేరాఫ్.. మునగపాక

- నందీశ్వర కళా ప్రాంగణం వేదికపై పలు నాటకాల ప్రదర్శన

ప్రజాశక్తి-మునగపాక:కళారంగం ఆ ఊరికి మకుటం.. కళలు ఆ గ్రామానికి కరతలామలకం... కళలు, కళాకారులు కనుమరుగవుతోన్న నేటి రోజుల్లో, కళాకారులను అందనంత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దిన మేటి రంగస్థలం... నందీశ్వర కళాప్రాంగణం (తులసి కళావేదిక). రైతాంగ పోరాటాలకు పురిటిగడ్డగా ప్రసిద్ధి చెందిన మండల కేంద్రం మునగపాక, మరోవైపున కళారంగానికి నిలువెత్తు దర్పణంగా విరాజిల్లుతోంది.

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నాటిక, నాటక ప్రదర్శనలకు నటనాలయం మునగపాకలోని నందీశ్వర కళాప్రాంగణం. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద కళా వేదికగా ప్రసిద్ధి చెందిన ఈ రంగస్థల వేదికపై సాంఘిక నాటకాలతో పాటు, జానపద, పౌరాణిక నాటకాల ప్రదర్శనలు కోకొల్లలుగా జరిగాయంటే అతిశయోక్తి కాదు. ఆగస్టు నెల వచ్చిందంటే నవ నూతన పడుచులా అందాలను సంతరించుకున్న ఈ రంగస్థలంపై ఏటా గ్రామం నుంచి, రాష్ట్రస్థాయి వరకు నాటిక, నాటక పోటీలు నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. కళారంగంలో ప్రతిభావంతులు, నిష్ణాతులకు పురస్కారాలు, సన్మానాలు ప్రోత్సాహకాలు ఈ వేదికపై అనునిత్యం జరుగుతూనే ఉంటాయి.

మండల కేంద్రం మునగపాక ఒక్క గ్రామంలోనే 29 నాటిక సమాజాలు ఉన్నాయి. వారంతా ఈ రంగస్థలంపైన ప్రదర్శనలు ఇచ్చి, రాష్ట్రస్థాయిలోనే ప్రముఖుల చేత ప్రశంసలను అందుకున్న వారే. ఈ రంగస్థలంపై నటించిన పలు కళాకారుల ప్రదర్శనలు చూసి, వాటి ప్రేరణతోనే మునగపాకలో ఇంటికొక కళాకారుడు తయారయ్యాడు. ఈ వేదికపై కళారంగంలోని అడుగిడిన ఎందరో కళాకారులు సినీ దర్శకులుగా, రచయితలుగా, నటులు, సాంకేతిక నిపుణులుగా ఎదిగి పలువురికి ఆదర్శంగా నిలుస్తూ మునగపాక కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు.

ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ కళాకారులు సుబ్బరాయ శర్మ, ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు గజల్ శ్రీనివాసరావు ఈ వేదిక మీద నుంచి ప్రదర్శనలు ఇచ్చారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఉత్తరాంధ్రలో మొట్టమొదటగా నందీశ్వర కళా ప్రాంగణంపైనే మాటా పాటను వినిపించారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సురభి నాటకరంగ కళాకారులు (హైదరాబాద్) ఈ రంగస్థలంపై 2002లో మాయాబజార్, వీర బ్రహ్మంగారి జీవిత చరిత్ర, లవకుశ, శ్రీకృష్ణలీలలు అనే పౌరాణిక నాటికలు ప్రదర్శనలు ఇచ్చి కళావేదికకు వన్నె తెచ్చారు.



1971లో సినీనటులు, ప్రజానాట్యమండలి కళాకారులు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిని ఆనాటి ఎమ్మెల్యేలు గోవిందరావు, పివి రమణ ఈ వేదిక మీదనే సన్మానించారు. ప్రజానాట్య మండలి కళాకారులు దండు నాగేశ్వరరావు, వై.అప్పారావు, పీల రామారావు, వేగి సూర్యనారాయణ వంటి దర్శకుల నేతృత్వంలో ఈ రంగస్థలంపై పరిషత్ నాటక పోటీలు అనేకమార్లు జరిగాయి. తిరుపతి మాజీ ఎంపి, టిడిపి మాజీ మంత్రి, సినీ నటుడు డాక్టర్ శివప్రసాద్, సుబ్బరాయశర్మ ఇదే వేదికపై 1989లో నాటక ప్రదర్శన ఇచ్చి ఇటువంటి కళావేదిక, కళాకారులను మేమెన్నడూ చూడలేదని ఇక్కడే ప్రశంసల వర్షం కురిపించడం విశేషం. ఇదే సందర్భంలో ప్రముఖ చలనచిత్ర నటుడు జెవి సోమయాజులు (శంకర శాస్త్రి) బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

నందీశ్వర కళావేదికపై ప్రదర్శించిన నాటికలు, నాటకాలకు గ్రామంలోని 'గ్రామీణ యువజన మందిరం' పాత్ర బహు కీలకమైనదిగా చెప్పుకోవచ్చు. ఆర్థిక, సాంఘిక, విద్యారంగంలో వెనుకబడిన మునగపాక, పరిసర ప్రాంత ప్రజానీకాన్ని విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే మహాదాశయంతో, గ్రామపెద్ద, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పివి.రమణ గ్రామంలోని మందబయలు ప్రాంతంలో 1957లో యువజన గ్రంథాలయం నెలకొల్పారు. తరువాత రోజుల్లో 1962లో దీనినే గ్రామీణ యువజన మందిరంగా పేరును మార్పు చేశారు. 1964లో గ్రంథాలయాన్ని రిజిస్టర్ చేసి, ఆగస్టు 15న ప్రారంభోత్సవం చేశారు. నాటి నుంచి నేటి వరకు యువజన మందిరాన్ని గ్రామ పెద్దలు, యువకులు నడిపిస్తూ విజ్ఞానదాయకమైన సాహిత్యాలను చదువరులకు అందించడంతో పాటుగా, కళలు, కళాకారులను ప్రోత్సహించాలని సంకల్పంతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రజ్ఞాశాలురైన రంగస్థల కళాకారులను రప్పించి, నాటిక, నాటకాల ప్రదర్శనలకు నందీశ్వర కళా ప్రాంగణాన్ని వేదికగా రూపుదిద్దారు.

నందీశ్వర కళా ప్రాంగణం నిర్మాణం

మునగపాకకు చెందిన పెంటకోట సూర్యనారాయణ(డిపో) వంశస్థులు బూరి విరాళంగా ఇచ్చిన పది సెంట్లు విస్తీర్ణంలో నందీశ్వర కళా ప్రాంగణం నిర్మించారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు, సేవాగరిడి నిర్వాహకులు బొడ్డేడ పోలినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, దొరమ్మ గారి అప్పన్న, దాడి అప్పలనాయుడు, ఆడారి వెంకన్న తదితర తోడపెద్దు సేవాగరిడి సంఘం వారు నంది విగ్రహాన్ని స్థాపించారు. కాలక్రమేణా గ్రామస్తుల సహాయ సహకారంతో 1970లో నంది విగ్రహంపై శ్లాబ్ నిర్మాణం చేపట్టగా, దానిని నంది గుడిగా పిలిచేవారు. అదే నందీశ్వర కళా ప్రాంగణంగా, కళావేదికగా రూపాంతరం చెందింది. అప్పటివరకు గ్రామంలోని పాఠశాలలలోనూ, వీధులలోనూ నాటికలు, నాటకాలు ప్రదర్శించిన పూర్వ కళాకారులు, నందీశ్వర కళాప్రాంగణంపైన ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. నాటినుండి నిరాటంకంగా ప్రదర్శనలు జరుగుతూ, 2018నాటికి నందీశ్వర కళాప్రాంగణం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.

విశాఖ డెయిరీ అధ్యక్షులు ఆడారి తులసిరావు సమకూర్చిన డెయిరీ నిధులతో రంగస్థల వేదిక నిర్మాణం, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. విశాలమైన ప్రాంగణాన్ని నిర్మించడంతోపాటు, నటులకు అనుగుణంగా మార్పులు చేపట్టి సరికొత్త అందాలను సృష్టించారు. నాటి నుండి నందీశ్వర కళా ప్రాంగణం 'తులసి కళావేదిక'పేరుతో నూతన ఒరవడిని సంతరించుకుంది.

పుష్కల సాగునీటి వనరులు, పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి..)

వేచలపు పాలవెల్లి జలాశయం ద్వారా చీడికాడ, మాడుగుల, బుచ్చయ్యపేట, చోడవరం, దేవరాపల్లి మండలాలకు చెందిన సుమారు 14 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఇవిగాక జిల్లాలోని కల్యాణపులోవ, తాండవ, పాలగెడ్డ, ఉరకగెడ్డ, గొర్రిగెడ్డ రిజర్వాయర్లు ఎంతో ప్రసిద్ధిగాంచాయి. వీటితో వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం మూతపెట్టడం, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యతనివ్వకపోవడం వంటి అంశాలు రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వ్యవసాయం గిట్టుబాటుకాక వలసవైపు వెళ్లేలా చేస్తున్నాయి.

పారిశ్రామిక కేంద్రంగా రూపాంతరం

జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఒకప్పుడు వ్యవసాయ ఆధారిత గ్రామాల సమూహంగా ఉన్న ఈ ప్రాంతాలు పారిశ్రామిక కేంద్రాలుగా మారాయి. పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు వచ్చిపడ్డాయి. పరవాడలో ఎన్‌టిపిసి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు ఒక మైలురాయి. ఇక్కడి ఫార్మాసిటీలో వందల కంపెనీలు ఉత్పత్తి సాగిస్తున్నాయి. వీటిలో చట్ట ప్రకారం.. స్థానికులకు ఉపాధి దక్కడం లేదు. మరోవైపు ఫార్మా పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయన జలాలు సముద్రం, చెరువుల్లో కలిసి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. మత్స్యకారుల బతుకులు కష్టంగా మారాయి. పరిశ్రమల ఏర్పాటుతో నష్టపోయిన ప్రజానీకంవైపు ప్రభుత్వం ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

వాణిజ్య కేంద్రం.. అనకాపల్లి పట్టణం

సుమారు లక్ష మంది జనాభా ఉన్న అనకాపల్లి పట్టణం వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. జిల్లా ప్రధాన కేంద్రంలోనున్న ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి, బెల్లం మార్కెట్, ఎఎంఎఎల్ కళాశాల వంటి సంస్థలతో పాటు సిఎంఆర్, లక్కీ, ఎస్ఆర్ వంటి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ కూడా పుట్టుకురావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో అనకాపల్లి పట్టణానికి ప్రజలు తరలివస్తున్నారు. గతంలో సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం వెళ్లి సామాన్యులు తమ సమస్యలు విన్నవించు కోవడానికి వ్యయప్రయాసలు పడేవారు.

అనకాపల్లి జిల్లాగా ఆవిర్భవించాక జిల్లా కార్యాలయాలు తమ ప్రాంతంలోనే ఏర్పడడంతో అనకాపల్లి పట్టణ పరిసర 24 మండలాల నుంచి కాసింత సులువుగా తమ సమస్యలను విన్నవించే అవకాశం ప్రజలకు ఏర్పడింది. అయితే కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉందన్న విమర్శలున్నాయి.

బొజ్జన్న కొండను చూసొద్దామా..



బొజ్జన్నకొండ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి పట్టణం చెంతనున్న బొజ్జన్నకొండకు ఎంతో విశిష్టత ఉంది. ఇది విజ్ఞాన, విహార, పర్యాటక కేంద్రం. రెండు వేల ఏళ్ల చరిత్ర దీని సొంతం. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రంగా ఇది వెలుగొందుతోంది. అనకాపల్లి మండలం శంకరం గ్రామం సమీపంలో ఈ క్షేత్రం ఉంది. అనకాపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో, రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ కొండకు నిత్యం సందర్శకులు పోటెత్తుతారు. బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, బుద్ధ విహారాలు, బుద్ధుని అతిపెద్ద శిలా విగ్రహాలు ఉండడంతో దీనిని బుద్ధుని కొండ అని, బొజ్జన్నకొండ అని పిలుస్తారు. చరిత్రకారులు దీనిని పవిత్ర బౌద్ధ క్షేత్ర ఆరామంగా పరిగణించారు. అతి ప్రాచీన బౌద్ధ శిల్పకళా సంస్కృతిలో ఈ కొండకు ప్రత్యేకత ఉంది. బౌద్ధ ఔన్నత్యాన్ని చాటిచెప్పే బౌద్ధ శిథిలాలను, గత వైభవ చిహ్నాలను ఇక్కడ నేటికీ చూడవచ్చు. ఏటా సంక్రాంతి తరువాత వచ్చే కనుమ రోజు ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది.